St 1 Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 41 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 11 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 03 ISSUE : 41 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 11 February 2026 PAGES : 8 PRICE : 3/-


## నక్సలిజంతో ఏ సమాజమూ బాగుపడలేదు



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఫిబ్రవరి 10)

నక్సలిజం వల్ల ఏ సమాజం బాగుపడలేదని, అది ఉన్న చోటల్లా విధ్వంసమే జరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రమైన జగదల్‌పుర్‌లో నిర్వహించిన 'బస్తర్ పండుమ్-2026' సాంస్కృతిక ముగింపు వేడుకకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నక్సలిజాన్ని మార్చి 31 నాటికి దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టేస్తామని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఇప్పటికీ కొందరు మావోయిస్టులు గిరిజన యువతులను తమ దళంలో కొనసాగిస్తుండడంపై అమిత్ షా ఆందోళన వ్యక్తం చేశారు. మిగిలిన మావోయిస్టులందరూ లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవాలని, వారికి గౌరవప్రదమైన పునరావాసం కల్పిస్తామని సూచించారు. అలా కాదని ఇంకా ఆయుధాలతో విధ్వంసం సృష్టిస్తామంటే మాత్రం తామూ ఆయుధాలతోనే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. 'మేం ఎవరితో పోరాడాలని అనుకోవట్లేదు. గిరిజన సోదరులు, అక్కా చెల్లెళ్లను కాపాడుకోవాలనేది మా లక్ష్యం. ప్రస్తుతం బస్తర్ ప్రాంతం అభివృద్ధి మార్గంలో నడుస్తోంది. పాఠశాలలు తెరవడంతో పాటు రోడ్లు, మొబైల్ టవర్లు, పోస్టాఫీసులు, విద్యుత్తు సౌకర్యాలు కల్పిస్తున్నాం" అని అమిత్ షా వెల్లడించారు.

# నైపుణ్యాభివృద్ధి సంస్థను మరింత బలోపేతం చేయండి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 10)

నైపుణ్యాభివృద్ధి సంస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇతర శాఖల్లోని నైపుణ్యాభివృద్ధి పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను దీనితో ఇంటిగ్రేట్ చేయాలని చెప్పారు. ఉపాధి కూలీలకూ ఎలాంటి నైపుణ్యం నేర్పించగలరో చూడాలని సూచించారు. మంత్రులు, కార్యదర్శులతో సమావేశంలో నైపుణ్యాభివృద్ధి అంశంపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. నైపుణ్యాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి నైపుణ్యాభివృద్ధి కార్యదర్శి కోన శశిధర్ వివరిస్తూ.. 'సరైన విద్యార్హతలు లేని, ప్లంబర్, ఎలక్ట్రిషియన్ లాంటి వారికి ఆయా పనుల్లో వారికున్న నైపుణ్యం ఏ స్థాయిలో ఉందనేది గుర్తించేందుకు ఏఐతో 'స్కిల్ టెస్ట్' చేసి, వారి నైపుణ్యాన్ని అంచనా వేస్తున్నాం. అన్ని జిల్లాలో ఇలా లక్ష మందికిపైగా స్క్రీనింగ్ చేశాం. నీతి ఆయోగ్ సూచన మేరకు నిధుల సమీకరణలో భాగంగా ప్రపంచ బ్యాంక్ ఫండింగ్ కోసం వచ్చే నాలుగేళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం' అని చెప్పారు. సీఎం స్పందిస్తూ.. దానికంటే ముందు వివిధ శాఖల్లో నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన నిధులను సమీకరించుకుని వాటితో పనిచేయాలని సూచించారు. ఒక్క కార్మిక శాఖ నుంచే ఏటా రూ.300 కోట్లు దీనికోసం సమీకరించే అవకాశం ఉంటుందని ఉదాహరణగా చెప్పారు.

## ఆ భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం: జగన్

**చంద్రబాబు ప్రభుత్వం జీఎస్‌డీపీపై తప్పుడు లెక్కలు చెబుతోందని జగన్ ఆరోపణ**

**11.75 శాతం వృద్ధి అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శ**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 10)


వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం తప్పుడు జీఎస్‌డీపీ (స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి) గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందనే భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు.ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.75 శాతం వృద్ధి సాధించిందని, 2025-26లో ఇది 10.75 శాతంగా ఉంటుందని అంచనా -మిగతా 2లో

## విశాఖ వాసులకు గుడ్ న్యూస్.. మెట్రో రైలు ప్రాజెక్టుకు పచ్చజెండా

విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం

సీఎం చంద్రబాబుతో భేటీలో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్

పెరుగుతున్న ట్రాఫిక్, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వ ప్రతిపాదన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 10)

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీ శుభవార్త అందింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుకు ఈ మేరకు ఈ సానుకూల స్పందన లభించడం గమనార్హం.సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సీఎం చంద్రబాబు, ఇవాళ పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. -మిగతా 2లో

## ఏఐని చూసి భయపడకండి దానిపై పట్టు సాధించండి..



మొబైళ్లకు బానిసలుగా మారొద్దు

'పరీక్షా పే చర్చా'లో విద్యార్థులకు ప్రధాని మోదీ సూచన

విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఫిబ్రవరి 10)

కృత్రిమ మేధ(ఏఐ)ను చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ సాంకేతికతతో నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. 'పరీక్షా పే చర్చా' రెండో ఎపిసోడ్ లో భాగంగా సోమవారం ఆయన వివిధ -మిగతా 2లో

## సీషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక చేయూత రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన మోదీ



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో భేటీ అయిన సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఫిబ్రవరి 10)

హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకమైన సీషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ, సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ మధ్య దిల్లీలో జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం రూ.1,500 కోట్ల (175 మిలియన్ అమెరికన్ డాలర్ల) ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. ఈ నిధులతో సీషెల్స్‌లో అభివృద్ధి, భద్రత, మౌలిక సదుపాయాల రంగాల్లో కీలక ప్రాజెక్టులు చేపట్టనున్నారు. -మిగతా 2లో

## డీల్ కుదిరినా.. 1% టారిఫ్‌ల తగ్గింపే.. అమెరికా-బంగ్లాదేశ్ ఒప్పందం



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఫిబ్రవరి 10)

వ్రతం చెడ్డా.. ఫలం దక్కాలి అనేది సామెత.. కానీ, బంగ్లాదేశ్ విషయంలో దీనికి భిన్నంగా జరిగింది.. అమెరికా తో డీల్ కుదిరినా ఆశించిన ఫలం దక్క లేదు..! అమెరికా-బంగ్లాదేశ్ మధ్య వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీని ప్రకారం ఆ దేశంపై టారిఫ్‌లు 20 శాతం నుంచి 19 శాతానికి తగ్గనున్నాయి. సోమవారం అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్, బంగ్లా ప్రతినిధి షేక్ బషీరుద్దీన్ సంతకాలు చేశారు. ఈ విషయాన్ని శ్వేతసౌధం ఓ ప్రకటనలో ధ్రువీకరించింది. ఈ ఒప్పందం ప్రకారం బంగ్లాదేశ్ టెక్స్‌టైల్స్, అప్పెరల్స్ సరకులపై మినహాయింపులు పొందేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తుంది. అయితే అమెరికాలో తయారైన కాటన్ ఉపయోగించేందుకు బంగ్లాదేశ్ అంగీకరించినట్లు ఆ దేశ సలహాదారు మహమ్మద్ యూనస్ స్వయంగా సోషల్ మీడియాలో వెల్లడించారు. గతంలో బంగ్లాదేశ్‌పై ట్రంప్ 37శాతం టారిఫ్‌లు విధించగా.. ఆ తర్వాత దానిని 20 శాతానికి తీసుకొచ్చారు. ఈ ఒప్పందం తర్వాత మరొక శాతం తగ్గించి 19 శాతం వద్ద స్థిరీకరించారు. భారత్-అమెరికా వాణిజ్యఒప్పందం 18 శాతం టారిఫ్‌ల వద్ద కుదరడంతో.. -మిగతా 2లో

## సభకు రాకపోవడం ప్రజలను అవమానించడమే

**వైసీపీపై ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు ఫైర్**

వైసీపీ ఎమ్మెల్యేలపై ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు తీవ్ర విమర్శలు

చర్చలకు బదులు అరాచకానికే వైసీపీ అలవాటుపడిందని వ్యాఖ్య

151 నుంచి 11 సీట్లకు పడిపోవడమే వైసీపీ పాలనకు నిదర్శనం

22-ఏను అడ్డుపెట్టుకుని రైతులను వైసీపీ ప్రభుత్వం వేధించిందన్న కాల్వ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 10)

శాసనసభ చర్చలకు దూరంగా ఉండటం అంటే ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అవమానించడమేనని ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన



మంగళవారం మాట్లాడారు. శాసనసభ్యులుగా తమ ప్రాథమిక బాధ్యతలను వైసీపీ నేతలు పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు.

గత నాలుగు సమావేశాలకు డుమ్మా కొట్టిన వైసీపీ, చర్చల స్థానంలో అరాచక ప్రవర్తనకే అలవాటు పడిందని కాల్వ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం రోజు -మిగతా 2లో

## వైవీ సుబ్బారెడ్డికి సీఎం భద్రత కల్పించాలి

**తిరుమల లడ్డూలు కల్తీ నెయ్యితో తయారు చేసినట్లు జగన్ చిన్నాన్న సుబ్బారెడ్డే అంగీకరించారన్న మంత్రి సవిత**



(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఫిబ్రవరి 10)

టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి సీఎం భద్రత కల్పించాలంటూ మంత్రి ఎస్ సవిత సంచలన కామెంట్స్ చేశారు. నిన్న టీడీపీ కడప పార్లమెంట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ తిరుమల లడ్డూలు కల్తీ నెయ్యితో తయారు చేసినట్లు జగన్ చిన్నాన్న సుబ్బారెడ్డే స్వయంగా -మిగతా 2లో

## ఊరి బడిని కాపాడుదాం





**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 10)**
మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ప్రాంతీయ మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎర్రగొండపాలెం యూటీఎఫ్ అధ్యక్షుడు ఆర్ ఏసా నాయక్ అధ్యక్ష వహించారు. ఈ సమావేశానికి మూడు మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధాన అజెండాగా ఊరి బడిని కాపాడుకుందాం అనే నినాదంతో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తమ పరిధిలో ఉన్న పిల్లలందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించాలని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ బడులను కాపాడుకుందాం అని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే 12వ పిఆర్సి కమిటీని నియమించాలని 29% ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వానికి విన్నయించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు ఉపాధ్యక్షులు రాష్ట్ర కౌన్సిలర్, తదితరులు పాల్గొన్నారు.


## ఆత్మకూరు, భీమవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 10)**
మండల పరిధిలోని ఆత్మకూరు, భీమవరం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి డి విజయకుమార్ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, సేవలను యాప్ ద్వారా ఎలా పొందాలో రైతులకు వివరించారు. డ్రోన్ సేవలు కావలసిన రైతు ముందుగా ప్లేస్టోర్ లో ఊబరైసేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్ అని యాప్ ఓపెన్ చేసుకొని అందులో ఉన్న కిసాన్ డ్రోన్ సర్వీస్ నుండి అభ్యర్థన పంపించి సేవలు పొందవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితులలో పంటలలో పురుగు మందుల పిచికారీ సమర్ధవంతంగా తక్కువ సమయంలో, తక్కువ మందుతో పూర్తి చేయవచ్చన్నారు. కాబట్టి రైతులు అందరూ డౌన్లోడ్ చేసుకొని సేవలు పొందాలని, సేవల గురించి రైతుసేవా కేంద్రం సిబ్బంది కూడా సహకరిస్తారని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, విఏఏ, విహెచ్ఏలు అజయ్, సురేష్, వెంకట్రావు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో శివ భక్తుల పై పోలీసులు లాఠీ ఛార్జ్ చేయుటం దారుణం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 10)**
శ్రీశైలంలో శివ భక్తులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేయటం దారుణమని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో ఖండించారు. భక్తులకు వసతులు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్నటువంటి శ్రీశైల దేవస్థానం అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, భక్తుల పై దాడికి నైతిక బాధ్యత వహిస్తూ దేవాదాయ శాఖ మంత్రి భక్తులకు క్షమాపణ చెప్పాలని లాఠీఛార్జ్ చేసిన పోలీస్ అధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సహజంగా ప్రజలు ఉద్యమాలు చేస్తుంటే పోలీసు వారు లాఠీ చార్జీలు చేస్తుండడం వారికి అలవాటు. కానీ దేవుని సన్నిధిలో కూడా శివ మాల ధరించిన భక్తులపై లాటి చార్జ్ చేయటం ఏమిటని ప్రశ్నించారు.

**మొదటి పేజీ తరువాయి**

## ఏఐని చూసి భయపడకండి దానిపై పట్టు సాధించండి..

రాష్ట్రాల విద్యార్థులతో సంభాషించారు. "కొత్త సాంకేతికత వచ్చినప్పుడల్లా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కంప్యూటర్లు వచ్చినప్పుడు ఏదో జరగనుందన్న చర్చ జరిగింది. ఇలాంటి భయాలు వీడండి. కొందరు చిన్నారులు మొబైళ్లకు బానిసలుగా మారుతున్నారు. స్మార్ట్‌ఫోన్ లేకపోతే తిండి కూడా తినడం లేదు. ఇది సరైన పద్ధతి కాదు. సాంకేతికతను నైపుణ్యాలు పెంచుకోవడానికి వినియోగించుకోవాలి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మోదీ సమాధానం చెప్పారు.

**మంచి నాయకుడి లక్షణాలేంటి?**
మోదీ: నాయకుడిగా ఎదగాలంటే ఎవరూ సాహసించని పనులు చేయాలి. నాయకుడు అంటే ఎన్నికల్లో పోటీ చేయడం, పార్టీలు పెట్టడం కాదు. మీ అభిప్రాయాలను పదిమందికి అర్థమయ్యేలా చెప్పగలగాలి.

**స్టార్టప్ ఎలా ప్రారంభించాలి?**
స్టార్టప్‌నకు వయసుతో సంబంధం లేదు. విద్యార్థి దశలోనూ ప్రారంభించొచ్చు. ఇందుకోసం మీరు ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేయండి. పారిశ్రామికవేత్తలను కలవండి. మీ ఆలోచనలు వారితో పంచుకోండి. ఆ ప్రయాణంలో మీకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. అవి మీకు ఉపయోగపడతాయి.

**పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?**
మంచి విద్యార్థిగా మారాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించాలి. గొప్ప క్రీడాకారుడు నిరంతరం సాధన చేస్తాడు. పడతాడు.. లేస్తాడు.. విజయం సాధిస్తాడు. చదువూ అంతే. సాధన కీలకం.

**క్రమశిక్షణ, ప్రేరణ.. ఏది ముఖ్యం?**
రెండూ ముఖ్యమే. క్రమశిక్షణ లేకపోతే స్ఫూర్తి ఎంత ఉన్నా ఫలితం శూన్యం.

## సీషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక చేయూత రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన మోదీ

ఆరు రోజుల భారత పర్యటనలో భాగంగా మోదీతో హెర్మినీ సోమవారం మధ్యాహ్నం విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, సముద్ర భద్రత, సుస్థిరత, వాతావరణ మార్పులకు అనుగుణ చర్యలు వంటి అంశాల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. సీషెల్స్ భారత్‌కు కీలక సముద్ర పొరుగు దేశమని ప్రధాని పేర్కొన్నారు. 'భారత్–సీషెల్స్ బంధం భౌగోళిక సంబంధమే కాదు, చరిత్ర, విశ్వాసం, భవిష్యత్ దృష్టితో కూడిన భాగస్వామ్యం. సీషెల్స్ అవసరాల ప్రకారం అభివృద్ధి సహకారం అందిస్తున్నాం' అని మోదీ తెలిపారు. ప్రకటించిన 175 మిలియన్ డాలర్ల ప్యాకేజీ ద్వారా సామాజిక గృహ నిర్మాణం, ఈ-మొబిలిటీ, వృత్తి శిక్షణ, ఆరోగ్య సేవలు, రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు చెప్పారు.

**నేడు, రేపు తాజ్‌మహల్ మూసివేత**
సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ, తన భార్య వెరోనిక్ హెర్మినీతో కలిసి మంగళవారం తాజ్‌మహల్‌ను సందర్శించనున్నారు. ఈ క్రమంలో ఉదయం 9:00 నుంచి 11:30 వరకు సాధారణ సందర్శకులకు ప్రవేశం నిలిపివేస్తున్నట్లు భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా మంగళవారం థాయ్‌లాండ్ యువరాణి సిరివన్నవారీ నరీరతన కూడా ఆగ్రాకు రానున్నారు. ఆమె ఫిబ్రవరి 11 ఉదయం తాజ్‌మహల్‌ను సందర్శిస్తారు. ఈ క్రమంలో భద్రత కారణాల వల్ల రెండురోజులపాటు పర్యాటకుల ప్రవేశం ప్రభావితమవుతుందని అధికారులు తెలిపారు.

## డీల్ కుదిరినా.. 1% టారిఫ్‌ల తగ్గింపే.. అమెరికా-బంగ్లాదేశ్ ఒప్పందం

వస్త్ర పరిశ్రమ ఆధారిత ఆర్థికవ్యవస్థ అయిన బంగ్లాదేశ్‌లో కంగారు మొదలైంది. దీంతో దేశంలో ఎన్నికల వేళ భారత్ కంటే తక్కువ టారిఫ్‌లతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు యత్నించింది. ఈ క్రమంలో అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, మెడికల్ పరికరాలు, ఆటోపార్టులు, ఇంధన ఉత్పత్తులకు బంగ్లాదేశ్ మార్కెట్‌ను తెరిచేందుకు అంగీకరించింది.

## సభకు రాకపోవడం ప్రజలను అవమానించడమే

మొక్కుబడిగా సభకు వచ్చి, కాగితాలు చించి గందరగోళం సృష్టించడం తప్ప ప్రజా సమస్యలపై మాట్లాడింది లేదని దుయ్యబట్టారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనను చూసిన ప్రజలు, కూటమికి 164 స్థానాలిచ్చి చారిత్రక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయినప్పటికీ వైసీపీ తన తీరు మార్చుకోకపోవడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 22-ఏ నిబంధనను ఒక ఆయుధంగా మార్చి రైతులను, సామాన్యులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని కాల్వ శ్రీనివాసులు ఆరోపించారు. తమ అవినీతి, భూకబ్జాలపై సభలో సమాధానం చెప్పలేకనే జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉందని, నిర్మాణాత్మక విమర్శలను స్వాగతిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా వైసీపీ ఎమ్మెల్యేలు తమ బాధ్యతను గుర్తించి, బడ్జెట్ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై గళం విప్పాలని కాల్వ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## ఆ భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం: జగన్

వేస్తున్నట్లు పేర్కొనడాన్ని జగన్ తప్పుబట్టారు. ఈ వృద్ధి రేటుతో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నామని ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఈ లెక్కలు ఏ స్వతంత్ర సంస్థ ఇచ్చినవి కావని, కేవలం చంద్రబాబు కార్యాలయంలో సృష్టించినవని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్న వృద్ధి నిజమైతే, పన్నుల రాబడిలో కూడా అదే స్థాయి పెరుగుదల కనిపించాలని జగన్ అన్నారు. కానీ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు విడుదల చేసిన లెక్కలు ప్రభుత్వ బూటకపు ప్రచారాన్ని బట్టబయలు చేశాయని తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి సగటున కేవలం 1.97 శాతంగా మాత్రమే ఉందని, ఇది దిగ్భ్రాంతికరమని అన్నారు. "11 శాతం పైగా జీఎస్‌డీపీ వృద్ధి సాధిస్తున్న రాష్ట్రంలో పన్నుల రాబడి 2 శాతం లోపు ఎలా ఉంటుంది? ఈ వింత గణాంకాలు చూసి ప్రపంచ ఆర్థికవేత్తలు కూడా ఆశ్చర్యపోతారు" అని జగన్ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో, దేశంలోని 23 రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల రాబడి వృద్ధిపై 'కాగ్' విడుదల చేసిన గణాంకాలను జగన్ ప్రస్తావించారు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు నుంచి రెండో స్థానంలో, అంటే 22వ ర్యాంక్‌లో నిలవడం సిగ్గుచేటని అన్నారు. ఇదే చంద్రబాబు '22వ ర్యాంక్ విజన్' అంటూ ఆయన సెటైర్లు వేశారు. చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఏదైనా విషయంలో మొదటి స్థానంలో ఉందంటే అది అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపులు, తప్పుడు ప్రచారంలో మాత్రమేనని జగన్ తీవ్రంగా విమర్శించారు.

## విశాఖ వాసులకు గుడ్ న్యూస్.. మెట్రో రైలు ప్రాజెక్టుకు పచ్చజెండా

ఈ క్రమంలోనే కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశాఖ మెట్రో ప్రాజెక్టుకు అనుమతి ఇస్తున్నట్లు ఖట్టర్ స్వయంగా చంద్రబాబుకు తెలిపినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో విశాఖ మెట్రో ఏర్పాటులో కీలక ముందడుగు పడినట్లయింది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైల్ ప్రాజెక్టులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు కూడా పంపింది. తాజాగా చంద్రబాబు పర్యటన నేపథ్యంలో విశాఖ ప్రాజెక్టుకు ఆమోదం లభించడంతో త్వరలోనే పనులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడ మెట్రో ప్రతిపాదనపై కూడా త్వరలో స్పష్టత రావచ్చని అధికారులు భావిస్తున్నారు.

## వైవీ సుబ్బారెడ్డికి సీఎం భద్రత కల్పించాలి

అంగీకరించారని, ఈ నేపథ్యంలో ఆయనకు భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. లేదంటే సుబ్బారెడ్డి ప్రాణాలకు ముప్పు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు వరదరాజులురెడ్డి, చైతన్య రెడ్డి, మాధవి, పుట్టా సుధాకర్ యాదవ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, బీటెక్ రవి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# దేశ రక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా సీఐఎస్ఎఫ్ జవాన్లు చేపట్టిన సైకిల్ ర్యాలీ

### తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ ఒంగోలు నుండి ముందుకు సాగిన సీఐఎస్ఎఫ్ జవాన్ల సైకిల్ ర్యాలీ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 10)**
దేశ శాంతి భద్రతల పరిరక్షణలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) కీలకమైన పాత్ర పోషిస్తున్నదని, సురక్షిత తీరం, తీర ప్రాంతాల పరిరక్షణతో పాటు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్-2026 పేరిట చేపట్టిన ఈ సైకిల్ యాత్ర, తొమ్మిది రాష్ట్రాల్లో 6,500 కిలోమీటర్ల దూరం ప్రయాణించనుంది. ఈ ర్యాలీని జనవరి 28వ తేదీన కోల్‌కతా నుంచి ప్రారంభించి, కేరళ రాష్ట్రం కొచ్చి వరకు కొనసాగించి ఫిబ్రవరి 23వ తేదీన ముగించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు సీఐఎస్ఎఫ్ జవాన్లకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ శ్రీ సంజీత్ కుమార్ గారు మాట్లాడుతూ, 100 మందికి పైగా సైకిలిస్టులతో ఈ సైకిల్ ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. సముద్ర తీర ప్రాంతాల రక్షణతో పాటు, దేశంలోని యువత మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఎదుర్కొనే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సైకిల్ ర్యాలీని ప్రతిరోజూ సుమారు 150 నుంచి 160 కిలోమీటర్ల మేర కొనసాగిస్తున్నామని, సీఐఎస్ఎఫ్ సిబ్బంది తమ ధైర్య సాహసాలు, క్రమశిక్షణతో ర్యాలీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని వివరించారు. తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు తీర భద్రత ప్రాధాన్యత, దేశ రక్షణలో వారి పాత్ర, భద్రతా దళాలకు వారు అందించవలసిన సహకారం గురించి ఈ ర్యాలీ ద్వారా వివరించబడుతోందన్నారు. దేశ భద్రతలో కోస్టల్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత ఉందని, అందుకు ప్రజల సంపూర్ణ సహకారం అవసరమన్నారు. వందేమాతరం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మాతృభూమి రక్షణ, దేశం కోసం త్యాగాలు చేయాల్సిన బాధ్యత వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ సైకిల్ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు 14 రోజులుగా నిరంతరంగా సైకిల్ ర్యాలీ కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.




ఈ ర్యాలీలో మహిళా జవాన్లు కూడా ఉత్సాహంగా పాల్గొంటుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్ సింగ్, ఎస్బి డిఎస్పి చిరంజీవి, ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ, ఒంగోలు ట్రాఫిక్ సీఐ జగదీష్, ఎస్ఐలు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.








ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
11.02.26 బుధవారం


# మంత్రి గొట్టిపాటి పిలుపునకు స్పందన

**8 పాఠశాలలకు మినరల్ వాటర్ ప్లాంట్లు**

**రూ.12 లక్షల చెక్కు అందజేసిన భగీరథ కెమికల్స్**



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఫిబ్రవరి 10)**
విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపు మేరకు భగీరథ కెమికల్స్ సంస్థ విరాళం ప్రకటించింది. నియోజకవర్గంలోని 8 ప్రభుత్వ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.12 లక్షల చెక్కును కంపెనీ ప్రతినిధులు లింగమనేని వెంకట రామయ్య, సిహెచ్ శ్రీనివాసరావు మంగళవారం మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో విద్యా రంగానికి సహకరించిన సంస్థను అభినందించారు. ఇప్పటికే అద్దంకి నియోజకవర్గంలో దాదాపు 7 వేల మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి, ఇప్పుడు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అన్నం సరిగా పెట్టడం లేదు సార్...

**మెనూ అసలు పట్టించుకోవడం లేదు**

**ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేసిన ఎస్సీ హాస్టల్ విద్యార్థులు**

**వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఇంటూరి**

**ఉలవపాడులో ఆకస్మికంగా హాస్టల్ తనిఖీ**

**ఎందుకిలా చేస్తున్నారంటూ సిబ్బంది పై ఆగ్రహం**

**మరోసారి తప్పు జరిగితే చర్యలు తప్పవని వార్నింగ్**



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 10)**
ఎమ్మెల్యే సార్ ! మా హాస్టల్లో భోజనం సరిగా పెట్టడం లేదు. చాలీచాలకుండా పెడుతున్నారు. మా వార్డెన్, మెనూ పట్టించుకోవడం లేదు. ఒకసారి మాట్లాడండి సార్... అంటూ ఉలవపాడులోని ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఉలవపాడులో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే వెళ్లారు. జడ్పీ హైస్కూల్లో సభ అనంతరం, విద్యార్థులు ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు పిల్లలను వెంటబెట్టుకుని పక్కనే ఉన్న హాస్టల్‌లోకి హఠాత్తుగా వెళ్లారు. పిల్లల ముందే వార్డెన్, వంట మనిషిని నిలదీశారు. మెనూ సరిగా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో కూడా ఇలాంటి ఫిర్యాదులే వచ్చాయని, అయినప్పటికీ మార్పు రాలేదని సీరియస్ అయ్యారు. ఈసారికి క్షమించి వదిలేస్తున్నాను, మరోసారి ఇలాంటి ఫిర్యాదు వస్తే ఊరుకునేది లేదు. (తరువాయి 4లో...)

# చస్తేనే స్పందిస్తారా....?

**పుల్లలచెరువులో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం**



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఫిబ్రవరి 10)**
ప్రజలెవరైనా చస్తేనే గాని స్పందించే పరిస్థితిలో పుల్లలచెరువు విద్యుత్‌శాఖ అధికారులు ఉన్నారు. వివరాల్లోకి వెళితే పుల్లలచెరువు మండల కేంద్రంలోని రాములవారి గుడి పక్కన ఉన్న 11 కేవీ ట్రాన్స్ఫార్మర్ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. 24 గంటల విద్యుత్ సరఫరా కొనసాగుతున్న ఈ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంప చెట్లు, పిచ్చి పొదలు అడవిలా పెరిగిపోయినా అధికారులు మాత్రం కళ్లున్నా అవి కనపడనట్లు (గుడ్డివారిలా) వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కంప చెట్లు కరెంటు తీగలకు తగులుతూ నిత్యం చిటపటమంటూ స్పార్కులు వస్తున్నా, (తరువాయి 4లో...)

# ఉపాధ్యాయుడిగా మారిన జిల్లా కలెక్టర్





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఫిబ్రవరి 10)**
జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పాలనా అధికారి పాత్రను పక్కన పెట్టి, ఒక ఉపాధ్యాయుడిలా విద్యార్థులతో మమేకమైన దృశ్యం గుళ్లపల్లి జిల్లా జెడ్పీ ఉన్నత పాఠశాలలో కనిపించింది. మంగళవారం చెరుకుపల్లి మండలం, గుళ్ళ పల్లి గ్రామం, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థుల మధ్య కలెక్టర్ కూర్చుని వారి చదువు, సందేహాలు, భయాలు గురించి ఆత్మీయంగా జిల్లా కలెక్టర్ విద్యార్థుల తో మాట్లాడారు. పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని, భయం ఎందుకు వస్తుందో, దాన్ని ఎలా దాటుకోవాలో ఒక గురువులా సులభమైన మాటల్లో వివరించారు. ప్రశ్నాపత్రాన్ని ఎలా చదవాలి, సమయాన్ని ఎలా వినియోగించుకోవాలి, తెలిసిన ప్రశ్నలను ముందుగా ఎలా రాయాలి వంటి అంశాలను ప్రత్యక్షంగా ఉదాహరణలతో చెప్పి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపారు. పాఠ్యపుస్తకమే మీ నిజమైన మిత్రమని, (తరువాయి 4లో...)

# తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

**కాఫీ, బిస్కెట్లకు మాత్రమే పరిమితమైన సమావేశం**

**ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం నిల్**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 10)**
పెద్దారవీడు మండల కేంద్రంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతతో జరిగిన సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఈ సందర్భంగా సమావేశంలో అధికారులు పాల్గొని తమ నివేదికలు చదివి వినిపించారు. ఈ నేపథ్యంలోనే ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పంచాయతీలలో తీర్మానాలు తీసుకోకుండా నీటిని ఎలా సరఫరా చేస్తారో, తీర్మానాలు లేకుండా యం బుక్కులు చేసి బిల్లులు ఎలా చేస్తారని సర్పంచులు నిలదీశారు. సానికరం గ్రామానికి సాగర్ నీరు కోసం పైపులైను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్న పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులను పంచాయతీ తరపున వచ్చిన వివిధ పనులను సర్పంచులకు తెలియకుండానే రోడ్ల నిర్మాణానికి వివిధ భవనాలకు తీర్మానాలు తీసుకోకుండా బిల్లులు చేస్తున్నారు. పంచాయతీలలో ఉన్నటువంటి అంగన్వాడీ భవనాలు నిరుపయంగా ఉన్నాయి వాటిని ఉపయోగంలోకి తెచ్చేవారే లేకుండా పోయారన్నారు దీంతోపాటుగా ఎన్నిసార్లు సర్వసభ్య సమావేశంలో విన్నవించుకున్నా అధికారులకు చెవిటోడు చెవిలో శంఖం ఊదినట్లు అయిందని వారంటున్నారు. ప్రతిసారి సమావేశానికి వచ్చినప్పుడల్లా టీలకు బిస్కెట్లకే మాత్రమే పరిమితం అవుతుందని ప్రజా ప్రతినిధులు సమావేశంలో చర్చించుకుంటున్నారు. ఈ సమావేశానికి కొంతమంది ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాన్ సుందరం, ఏపీవో సాంబయ్య, ఏపిఎం కృపమ్మ, ఆర్డబ్ల్యూఎస్ అధికారి భ్రమరాంబ, పంచాయతీరాజ్ సుబ్బారెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారి సుధాకర్, అగ్రికల్చర్ అధికారి లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఏఈ అంజిరెడ్డి, అటవీ శాఖ అధికారి బాల కుమారి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

# బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించాలి

**వివిధ శాఖల అధికారులకు సూచించిన కలెక్టర్ రాజాబాబు**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 10)**
ప్రకాశం జిల్లాలో ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ ను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విజయవంతంగా నిర్వహించేలా అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శ్రీ రాజాబాబు, జిల్లా అధికారులతో సమావేశమై ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ నిర్వహణలో భాగంగా శాఖల వారీగా చేపట్టవలసిన ఏర్పాట్లపై సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పాకల బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారిగా జిల్లా పరిషత్ సిఈఓ ను నియమించడం జరిగిందన్నారు. పాకల బీచ్ ప్రాముఖ్యత జిల్లా ప్రజలతో పాటు ఇతర ప్రాంత ప్రజలకు తెలిసేలా పాకల బీచ్ ఫెస్టివల్‌ను విజవంతంగా నిర్వహించేలా ఏ శాఖకు కేటాయించిన విధులను ఆ శాఖ అధికారులు సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ కు వచ్చే సందర్శకుల ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు.

ముఖ్యంగా పారిశుధ్య , మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి వసతి, పార్కింగ్ ఏర్పాట్లు పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా సందర్శకులకు ఆహ్లాదం కలిగించేలా వివిధ రకాల సాహస క్రీడలు, ఎగ్జిబిషన్, హెలికాప్టర్ రైడింగ్, లేజర్ షోతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను, ఫుడ్ కోర్టులను నిర్వహిస్తున్నందున సంబందిత ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా విచ్చేసే విఐపి, వివిఐపిల ప్రోటోకాల్ లో ఎలాంటి అశ్రద్ధ లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఫెస్టివల్ సందర్భంగా సందర్శకులకు అసౌకర్యం కలగకుండా అన్నీ ప్రాంతాల నుండి ఆర్‌టిసి బస్సులను నడపాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేసి పాకల బీచ్ ఫెస్టివల్ ను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ చిన ఓబులేసు, ఆర్డీఓ శ్రీమతి లక్ష్మీ ప్రసన్న, ఎస్డిసి శ్రీ శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ శ్రీ చిరంజీవి, (తరువాయి 4లో...)

# వెట్టి చాకిరి నిర్మూలనే లక్ష్యం తహసీల్దార్ జయలక్ష్మి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 10)

వెట్టి చాకిరి నిర్మూలన చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కనిగిరి మండలం తహసీల్దార్ జయలక్ష్మి అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా, వెట్టి చాకిరి నిర్మూలన చట్టం అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ,మార్కాపురం జిల్లా వెట్టి విమోచన కూటమి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వెట్టి విమోచన కూటమి ఆధ్వర్యంలో వెట్టి చాకిరి నిర్మూలనపై రూపొందించిన అవగాహన కరపత్రాన్ని తహసీల్దార్ జయలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వెట్టి చాకిరి నేరమని, బలవంతపు పనులు చేయించడం చట్టరీత్యా శిక్షార్హమని తెలిపారు. ఎవరైనా వెట్టి చాకిరికి గురైతే సంబంధిత అధికారులను, పోలీస్ వారిని న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ప్రజలందరూ ఈ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్,వెట్టి విమోచన కూటమి కనిగిరి డివిజన్ కన్వీనర్,గుడ్ హెల్ప్ రమేష్ బాబు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెను జయప్రదం చేయాలని ఒంగోలులో బైక్ ర్యాలీ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 10)

ఈ నెల 12న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఒంగోలులో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్మిక సంఘాలు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సంయుక్త కిసాన్ మోర్చా, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీ ఒంగోలులోని మినీ స్టేడియం నుండి నెల్లూరు బస్టాండ్, కలెక్టరేట్, చర్చి సెంటర్, ట్రంక్ రోడ్, మస్తాన్ దర్గా, పాత మార్కెట్, బాపూజీ కాంప్లెక్స్ మీదుగా అద్దంకి బస్టాండ్ సెంటర్ వరకు సాగింది. ఈ బైక్ ర్యాలీలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు శ్రీరామ్ శ్రీనివాసులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, సిఐటియు నాయకులు జివి కొండారెడ్డి, ఆర్ రమేష్, ఐఎఫ్టియు నాయకులు ఆర్ మోహన్, రెడ్ స్టార్ కార్మిక సంఘం నాయకులు సుబ్బారావు, తదితరులు బైక్ ర్యాలీకి నాయకత్వం వహించారు.

# అన్నం సరిగా పెట్టడం లేదు సార్...





చర్యలు కఠినంగా ఉంటాయి అంటూ హాస్టల్ సిబ్బందికి గట్టి వార్నింగ్ ఇచ్చారు. దీంతో పిల్లలు ఎమ్మెల్యే స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గత ఏడాది ఇదే హాస్టల్‌ను ఎమ్మెల్యే నాగేశ్వరావు సందర్శించగా స్లాబ్ ఉరుస్తున్న సంగతిని పిల్లలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తర్వాత ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, స్లాబును బాగు చేయించారు. మంగళవారం హాస్టల్ పరిశీలనలో ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు.

# ఉపాధ్యాయుడిగా మారిన జిల్లా కలెక్టర్

రోజూ కొద్దికొద్దిగా చదవడం వల్లే పెద్ద విజయం సాధ్యమవుతుందని తెలిపారు. చివరి నిమిషంలో ఒత్తిడి పెంచుకోకుండా, ముందుగానే పునశ్చరణ చేయాలని, అర్థం కాని విషయాలను దాచుకోకుండా ఉపాధ్యాయులను అడగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారి మాటలు కేవలం సూచనలు కాకుండా, ఒక గురువు హృదయంతో వచ్చిన మార్గదర్శకత్వంగా విద్యార్థులకు అనిపించాయి. అధికార హోదా దాటి, విద్యార్థుల భవిష్యత్తుపై బాధ్యత తీసుకున్న ఉపాధ్యాయుడిగా కలెక్టర్ నిలిచారని అక్కడి వాతావరణమే చాటి చెప్పింది. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ ఆర్ రామలక్ష్మి, డిఈఓ డి శ్రీనివాస్, తహశీల్దార్, యంపిడిఓ, యంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





# చస్తేనే స్పందిస్తారా....?

విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోతున్నా, ప్రజలు భయంతో వణికిపోతున్నారే తప్ప అధికారులకు మాత్రం ఏ మాత్రం చలనం లేదు. రోజూ ఈ మార్గంలో పాఠశాల పిల్లలు, వృద్ధులు, మహిళలు తిరుగుతుంటారని తెలిసినప్పటికీ ఎవరైనా చనిపోతే స్పందించచ్చులే అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తువ్నరు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, ఉన్నతాధికారులు ఈ ప్రమాదకర పరిస్థితిని చూసి కూడా చర్యలు తీసుకోకపోవడం వారి బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తుంది. ఏదైనా జరగరానిది జరిగితే అందుకు పూర్తి బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు విద్యుత్ అధికారులు సిద్ధంగా ఉన్నారా? కరెంటు తీగలకి అడ్డంగా ఉన్నవి అని పెద్ద పెద్ద చెట్లు నరికి వేసే విద్యుత్ సిబ్బంది ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఉన్న ఈ చెట్లు ఎందుకు తొలగించడం లేదో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు మేల్కొని ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఉన్న చెట్లను వెంటనే తొలగించి, భద్రతా చర్యలు తీసుకొని, ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
ప్రమాదాలు జరిగిన తర్వాత పరామర్శలు చేయడం కంటే ,
ముందస్తు చర్యలే కావాలి అని ప్రజలు స్పష్టంగా హెచ్చరిస్తున్నారు.
మరి ఇప్పటికైనా చెట్లు తొలగిస్తారో లేక తమకేమీ పట్టదు
అన్నట్టు మౌనంగా ఉంటారో వేచి చూద్దాం మరి...!

# బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించాలి

డిపిఓ శ్రీ వెంకటేశ్వర రావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డిఆర్డిఎ పిడి నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా విద్యా శాఖాధికారి రేణుక, ఐసిడిఎస్ పిడి సువర్ణ, విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో రబీ సీజనుకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 10)

రబీ సీజన్ కు సంబంధించి ఫిబ్రవరి 10వ తేదీ నుండి రాబోయే 21 రోజులకు గాను 7960 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో 1435 మీం అందుబాటులో ఉందని జిల్లా డాక్టర్ వి వినోద్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతు సేవ కేంద్రాలలో 1607 ఎంటిఎస్ లలోను, జిల్లా సహకార మార్కెటింగ్ సోసైటీలలో 207 ఎంటిఎస్, ప్రైవేట్ రిటైల్ వ్యాపారుల దగ్గర 1915 ఎంటిఎస్ మార్క్ ఫెడ్ గోదాములలో 2500 ఎంటిఎస్ టోకు వ్యాపారుల దగ్గర 276 ఎంటిఎస్, కంపెనీ గోదాములలో 20 ఎంటిఎస్ ఎరువులు రైతాంగానికి అందుబాటులో ఉంది రైతులు ఎవ్వరకు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. 45 కిలోల యూరియా బస్తా గరిష్ట చిల్లర ధర రూ.266.50.యూరియా ను గరిష్ట చిల్లర ధరకు మించి విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకొనబడునని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# గ్యాస్ సిలిండర్ పేలి మహిళకు గాయాలు



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 10)

మంగళవారం తెల్లవారు జామున మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో సుమారు 3.45 గంటల సమయంలో వంట చేయడానికి వెళ్లిన గుడ్డేట బాల గురవమ్మ గ్యాస్ వెలిగించడంతో ఒక్క సారిగా మంటలు రేగి గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఇంటి మెయిన్ తలుపు, కిటికీలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ ప్రమాదంలో ఆమెకు పూర్తిగా కాలిన గాయాలయ్యాయి. తదుపరి ఒంగోలు ప్రకాశం హాస్పిటల్‌లో చేర్పించగా ఆమె శరీరం 80 శాతం కాలిపోయిందని వైద్యులు తెలిపారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు విజయవాడకు తరలించారు.



# కందుకూరులో ఉత్సాహంగా 2కే రన్

# పాకల బీచ్ ఫెస్టివల్ కు తరలిరావాలని నేతల పిలుపు

## 2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, దామచర్ల సత్య

## కోటారెడ్డి హాస్పిటల్ జంక్షన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు సందడే సందడి

## భారీగా తరలివచ్చిన విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 10)**

ఈ నెల 14, 15 తేదీలలో సింగరాయకొండ మండలం పాకాల వద్ద బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న సందర్భంగా ఆ కార్యక్రమం పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కందుకూరు పట్టణంలో మంగళవారం 2కే రన్ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, రాష్ట్ర మారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, జెడ్పి సీఈవో చిరంజీవి, సబ్ కలెక్టర్ హిమవంశీ, డీఎస్పీ బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ అనూష, ఎంపీడీవో రత్నజ్యోతి తో సహా అనేకమంది అధికారులు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ పాఠశాలలు, కాలేజీల నుంచి వేల సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహంగా గడుపుతూ సందడి చేశారు. కోటారెడ్డి హాస్పిటల్ జంక్షన్ నుంచి పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ మన కందుకూరుకు దగ్గరలోని పాకల వద్ద ఈనెల 14,15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించబోతున్న బీచ్ ఫెస్టివల్ లో అందరూ పాల్గొనాలని, కుటుంబ సభ్యులతో తరలివచ్చి సంతోషంగా గడపాలని పిలుపునిచ్చారు. ప్రజలకు వినోదం, ఉల్లాసం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. నిత్యం ఒత్తిడితో, ఉరుకులు పరుగులతో జీవనం సాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో... బీచ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలు ఎంతో ఊరటనిస్తాయని పేర్కొన్నారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య గారు మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించబోయే బీచ్ ఫెస్టివల్ లో అనేక వినోద కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు బీచ్ అందాలను తిలకించేందుకు హెలికాప్టర్ రైడ్ కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఇంకా ఇతర నాయకుల సహకారంతో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని, కందుకూరు చుట్టుపక్కల ప్రజలంతా ఈ వేడుకల్లో పాలుపంచుకోవాలని దామచర్ల సత్య ఆహ్వానించారు. అలాగే యువ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారి సారధ్యంలో కందుకూరు నియోజకవర్గం పారిశ్రామిక కేంద్రంగా మారబోతోందని సత్య చెప్పారు. లక్షల కోట్ల రూపాయలతో పరిశ్రమలు రాబోతున్నాయని అన్నారు. కందుకూరు ప్రాంతంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున లభిస్తాయని చెప్పారు. తమ ప్రభుత్వం ప్రజల కోసం, వారి అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తుందని దామచర్ల సత్య పేర్కొన్నారు. అంతకుముందు కోటారెడ్డి హాస్పిటల్ జంక్షన్ వద్ద, సభా వేదికపై నాయకులు అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి విద్యార్థులు నినాదాలు చేసుకుంటూ ఉల్లాసంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, కూటమి పార్టీ నేతలు అధికారులు, ఫ్రైడ్ మీడియా ఈవెంట్స్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.









# ద్విచక్ర వాహనం పై మృతదేహం తరలింపు ఘటన పై స్పందించిన జిల్లా కలెక్టర్



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 10)**

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలో ద్విచక్ర వాహనంపై మృతదేహాన్ని తరలించిన ఘటనపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి సమగ్ర విచారణ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల ఏరియా ఆసుపత్రిలో ప్రస్తుతం 'మహాప్రస్థానం' వాహనం అందుబాటులో లేదని తెలిపారు. అయితే జిల్లా ప్రధాన ఆసుపత్రుల్లో ఈ వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు. బాపట్ల ఏరియా ఆసుపత్రికి మహాప్రస్థానం వాహనం మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో నమోదయ్యే మరణాల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని మహాప్రస్థానం వాహనాల కేటాయింపు జరుగుతుందని పెర్కొన్నారు. బాపట్ల ఏరియా ఆసుపత్రిలో మరణాల సంఖ్య తక్కువగా ఉండటంతో ఇప్పటివరకు వాహనం కేటాయించలేదని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందిన వారి మృతదేహాల రవాణా బాధ్యతను కుటుంబ సభ్యులు భరించాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నిధుల ద్వారా నిరు పేదలకు ప్రభుత్వమే అవసరమైన రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుందని తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు, విధుల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్ లేదా మెడికల్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆసుపత్రి అంబులెన్స్ ఏర్పాటు చేయడం లేదా అవసరమైన ఆర్థిక సహాయం అందించిన తరువాతే మృతదేహాన్ని డిశ్చార్జ్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్, ఆర్‌టీఓ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులతో త్వరలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి అంబులెన్స్ ఛార్జీల నియంత్రణపై నిర్ణయాలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# పేద విద్యార్థులకు చేయూత





**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 10)**

నాయకులు పేద పిల్లలకు సహాయం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు బాపట్ల సేవా సేతు భరోసా కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నందు ఏపిఆర్ఎస్ఏ నాయకులతో కలసి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా చీరాలలోని సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహానికి బాపట్ల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ తరుపున రూ.30 వేలు విలువైన 4 బెంచీలు, 30 చాపలు, 4 షటిల్ బ్యాట్‌లు, నెట్, క్యారమ్ బోర్డు, వాలీ బాల్, నెట్‌లను సాంఘిక సంక్షేమ శాఖ అధికారికి అందజేశారు. బాపట్ల సేవా సేతు ద్వారా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, జిల్లా లో పని చేయుచున్న రెవిన్యూ ఉద్యోగుల తరపున. బాపట్ల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ వారు తమ విరాళాలను విద్యార్థినీలకు వినియోగించడం అభినందనీయమన్నారు. చీరాలలోని ఎస్‌సి బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థినీల కొరకు రూ.30 వేలు విలువచేసే సామగ్రి ఇవ్వడం సంతోషదాయకమన్నారు. వాటికి సంబంధించిన బిల్లులను అందజేశారు. ప్రజలు చాలామంది తమ దాతృత్వాన్ని విరాళాల ద్వారా చాటుకుంటున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వాసిస్ట, డిఆర్ఓ ఎస్ లవన్న, జిల్లా ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి శివలీల, కలెక్టరేట్ ఏవో మల్లికార్జున్, బాపట్ల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ బాబు, కార్యదర్శి బి ఓంకార్, చీరాల డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె గోపికృష్ణ, చీరాల సిటీ యూనిట్ ఆధ్యక్షుడు ఎస్‌కె మహబూబ్ బాషా, కార్యదర్శి సుమంత్ రాజ్, బి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో హెచ్‌యం మృతి చెందడం బాధాకరం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

### విధులకు వెళుతూ హెచ్‌యం మృతి చెందడం విద్యశాఖకు తీరని లోటు

### జిల్లా విద్య శాఖ అధికారి డి శ్రీనివాస్

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 10)**

రోజు లాగా విధులకు బైక్ పై వెళుతూ ఏ శ్రీనివాసరావు మృతి చెందడం చాలా బాధాకరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పేర్కొన్నారు. చీరాల మండలం, గవిని వారి పాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌యం గా పని చేస్తున్న అంగిరేకుల శ్రీనివాసరరావు రోజు లాగా మంగళవారం ఉదయం తన ఇంటి నుండి బైక్ పై పాఠశాలకు వెళుతుండగా కేబుల్ వైర్ మెడకి తగలడంతో బైక్ మీద నుంచి కిందపడి మరణించడం చాలా బాధాకరమని, ఈ సందర్భంగా హెచ్‌యం మృతికి తన ప్రగాఢ సానుభూతిని కలెక్టర్ తెలియజేసారు. విద్యాశాఖలో గత కొన్ని సంవత్సరాలుగా పిల్లలకు విద్యాబోధన చేస్తూ మంగళవారం విధిరాత వల్ల రోడ్డు ప్రమాదంలో హెచ్‌యం మరణించడం చాలా బాధాకరమని హెచ్‌ఎం మృతికి జిల్లా విద్యాశాఖ తరఫున అధికారులు సిబ్బంది అందరూ సంతాపం వ్యక్తం చేస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# జాతీయ సార్వత్రిక సమ్మెకు ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మద్దతు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 10)**

భారతదేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఫిబ్రవరి 12న నిర్వహించనున్న జాతీయ సార్వత్రిక సమ్మెకు అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య మద్దతు ప్రకటించిన నేపథ్యంలో, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం మేరకు, సమ్మెకు సంఘీభావంగా కార్యక్రమాలు నిర్వహించాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. శరత్ బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సిహెచ్ కృష్ణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా నూతన కార్మిక చట్టాల రద్దు, వేతన సవరణ తక్షణ అమలు, పీఎఫ్ఆర్‌డీఏ చట్టం రద్దు, పెండింగ్ బకాయిల చెల్లింపు, కాంట్రాక్ట్ ఉద్యోగుల నియమితీకరణ, పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ అమలు, పీఎస్యూలు సొసైటీలకు 62 ఏళ్ల పదవీ విరమణ, ఉద్యోగుల కోసం మెమో 57 అమలు వంటి డిమాండ్ల సాధన కోసం మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. కావున ఫిబ్రవరి 12న మధ్యాహ్నం 1 గంట నుండి 2 గంటల వరకు ప్రకాశం జిల్లా కలెక్టరేట్ ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులతో సంఘీభావ ప్రదర్శన నిర్వహించాలని ఎన్జీజీవోస్ అసోసియేషన్, ప్రకాశం జిల్లా శాఖ నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, జీూజ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అలాగే ప్రకాశం జిల్లా పరిధిలోని అన్ని తాలూకా, డివిజనల్ కేంద్రాలలో ఉద్యోగులు, కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో పాల్గొని, ఏపీ ఎన్జీ జీవోస్ అసోసియేషన్ తరఫున సంఘీభావం తెలియజేయాలని అన్నీ తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులను కోరారు. ఈ సంఘీభావ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా లోని ఉద్యోగులందరిని వారు కోరారు.

# జాతీయస్థాయి హాకీ క్రీడాకారులకు అభినందనలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 10)**

మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కే సిరివల్లి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 జాతీయ స్థాయి హాకీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొని ప్రతిభ కనపరిచింది. మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం అను జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17 జాతీయస్థాయి హాకీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున పాల్గొని ప్రతిభ కనపరిచింది. మంగళవారం స్కూల్లో ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వీరికి సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాల్యాద్రి మాట్లాడుతూ మా స్కూల్ నుంచి జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఇద్దరికీ అభినందనలు తెలియజేస్తూ ఫస్ట్ టైం హై స్కూల్ నుంచి జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని వీరు జాతీయస్థాయి పోటీలకు వెళ్ళటానికి ఆర్థిక సహాయ, సహకారాలు అందించిన స్టాఫ్ మెంబర్స్ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. జాతీయస్థాయి హాకీ పోటీలలో పాల్గొనటకు కోచింగ్ ఇచ్చిన పీడీలు కే వనజ, సౌజన్యలను ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారని పీడీ కె వనజ తెలియజేశారు.

# చీమకుర్తిలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి ఆకస్మిక తనిఖీలు

విద్యార్థులకు అందించే ఆహారం మెనూ పాటించలేదని గిరిజన బాలుర వసతి గృహ సిబ్బంది పై ఆగ్రహం







(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఫిబ్రవరి 10)

విద్యార్థుల కి అందించే ఆహారంలో మెనూ తప్పక పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఇండేల లక్ష్మీరెడ్డి చెప్పారు. మంగళవారం చీమకుర్తిలో ప్రాథమిక ఉన్నత పాఠశాల, గిరిజన గురుకుల బాలుర విద్యాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకి స్వయంగా వడ్డించారు. ఆయన కూడా రుచి చూసి బాగుందని కితాబిచ్చారు. అక్కడ స్టాక్ రూమ్ ను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులను రోజు ఫుడ్ మెనూ ప్రకారమే పెడుతున్నారా లేక మేము వస్తున్నామని ఇలా చేసారా అని ఆరా తీశారు. విద్యార్థుల రోజు ఇలానే ఉంటుంది సార్ అని చెప్పడం, ఫుడ్ రుచిగా , నాణ్యంగా ఉండటం వల్ల ఆయన సంతృప్తి వ్యక్తం వ్యక్తం చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకి అందించే ఆహారం లో మెనూ సరిగా పాటించకాపోవడం , పప్పు పలచగా ఉండటం , కూరగాయలతో కూడిన కూర చెయ్యక పోవటం తో ఆయన వంట సిబ్బందిని మందలించారు. మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీడీ సోషల్ వెల్ఫేర్ లక్ష్మా నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి, డిఎస్వో పద్మశ్రీ, డిఎం సివిల్ సప్లైస్ అధికారి వరలక్ష్మి, సమగ్ర శిక్షా జిల్లా బాలిక సంరక్షణ అధికారి హేమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 12న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రచారం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 10)

కనీస వేతనాలు అమలు చేయాలని, గతంలో ఉన్న కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కార్మిక చట్టాలను రద్దుచేసి తెచ్చిన లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను ఉలవపాడు మండలంలో జయప్రదం చేయాలని, ఆరోజు సమ్మెలో పంచాయతీ కార్మికులంతా పాల్గొనాలని సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ కోరారు. మంగళవారం పంచాయతీ ఆఫీస్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడుతూ ఉలవపాడు పంచాయతీ పరిధిలో కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలుపరుస్తూ కనీసం 15 వేలకు తగ్గకుండా వేతనం ఇవ్వాలని కోరారు. పని భద్రత సౌకర్యాలను కల్పించాలని, పంచాయతీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 12న ఉలవపాడు తహసిల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం నిర్వహిస్తామని, సమ్మె సందర్భంగా ఉలవపాడులో ఉద్యోగులు,కార్మికులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఏవిఆర్వియన్ సత్యనారాయణ, జువ్విగుంట వెంకటేశ్వర్లు, పంచాయతీ మేస్త్రిలు వెలిచెర్ల శ్రీహరి, రావినూతల నరసింహం, పంచాయతీ కార్మికులు బాలమ్మ, సునీత, సుబ్బులు, సుశీల, కామాక్షమ్మ, దాసరి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# అద్దంకి నియోజకవర్గంలో విద్యార్థులకు 7 వేల సైకిళ్ల పంపిణీ చేశాం

## రాజకీయాలకు అతీతంగా తల్లికి వందనం అమలు చేస్తున్నాం
## విద్యార్థులకు తల్లికి వందనం అందేలా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదే
## త్వరలోనే మరో 4 వేల సైకిళ్లు విద్యార్థులకు అందిస్తాం
## అద్దంకి నియోజకవర్గ పర్యటనలో మంత్రి గొట్టిపాటి









(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఫిబ్రవరి 10)

అద్దంకి నియోజకవర్గంలో ఉన్న ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు కొందరు ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇప్పటి వరకు 7 వేల సైకిళ్లను దాతల సహాయంతో ఉచితంగా పంపిణీ చేశామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి మంగళవారం పర్యటించారు. జే పంగలూరు మండలం కొండమంజులూరు గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రజలకు అంకితం చేశారు. ఆ తరువాత అదే గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్ ను మంత్రి ప్రారంభించారు. గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పన, గ్రామీణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం బల్లికురవ మండలం, కొణిదెన గ్రామానికి చేరుకున్న మంత్రి గొట్టిపాటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 237 మంది విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., విద్యార్థులకు రాజకీయాలకు అతీతంగా తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులకు అందించే సైకిళ్లతో పాటు పుస్తకాలు, బ్యాగులు వంటి వాటిపైనా ఎటువంటి రాజకీయ గుర్తులు, రంగులూ లేకుండానే వారికి అందిస్తున్నామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ప్రతి ఇంట్లోని అర్హులైన విద్యార్థులందరికీ ఒక్కొక్కరికీ రూ.15,000 వేలు అందించామన్నారు. తల్లికి వందనంతో పాటు పుస్తకాలు, బ్యాగులు సరిగా అందుతున్నాయో లేదో, వారికి లబ్ధి జరుగుతుందో లేదో చూడాల్సిన బాధ్యత పాఠశాలల ప్రధానోపాధ్యాయులదే అని మంత్రి తెలిపారు. సెయిల్, నెడ్ క్యాప్, ఆసిస్ట్ తో పాటు మరెన్నో సంస్థలు సీఎస్ఆర్ నిధులతో విద్యార్థులకు సైకిళ్లను అందించడంలో ప్రముఖ పాత్ర పోషించాయని అభినందించారు. అద్దంకి పరిధిలో మరో 4000 మంది ఉన్నత పాఠశాలల విద్యార్థులకూ త్వరలోనే సైకిళ్లను అందజేస్తామన్నారు. విద్యార్థులు సైకిళ్లపై పాఠశాలలకు వచ్చేప్పుడు జాగ్రత్తగా రావాలని ఆయన కోరారు. ప్రయాణ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులతో పాటు టీచర్లు కూడా విద్యార్థులకు వివరించాలని మంత్రి గొట్టిపాటి సూచించారు.

### మత్స్యకారుల జీవనోపాధి కోసమే మీనోత్సవం..

మత్స్యకారులకు స్థిరమైన జీవనోపాధి కల్పించడం కోసమే మీనోత్సవం ద్వారా గుండ్లకమ్మలో చేప పిల్లలను వదులుతున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ నదిలో మంగళవారం నాడు మంత్రి గొట్టిపాటి 2.50 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., మత్స్యకారుల ఉపాధి, సంక్షేమం కోసం గతేడాది 20 లక్షల చేప పిల్లలను వదిలామన్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసమే రాయితీతో కూడిన బోట్లు, వలలను అందిస్తున్నామని తెలిపారు. వేట నిషిద్ధ సమయంలోనూ ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని గత వైసీపీ ప్రభుత్వం గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్వీర్యం చేసిందని మంత్రి ఆరోపించారు. మత్స్యకారులకు నష్టం కలిగేలా గుండ్లకమ్మ గేట్లను విరగొట్టిన వైసీపీ నేతలు., ఇసుక దోపిడీ చేశారని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గుండ్లకమ్మ ప్రాజెక్టుకు కొత్త గేట్లు పెట్టి, 2 టీఎంసీల నీటిని నిలువ ఉంచుతున్నామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. అదే విధంగా మత్స్యకారుల కోసం లక్షల సంఖ్యలో చేప పిల్లలను వదులుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తుంది




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 10)

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులు మండలంలోని నర్సాయపాలెం, గంగపాలెం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ముందుగా మండల వ్యవసాయ అధికారి కే నీరజ మాట్లాడుతూ రైతు సోదరులందరూ రైతన్న ఐడికి ఏపీ ఎఫ్ ఆర్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. దీనికోసం రైతే స్వయంగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆధార్ నెంబరు తో నమోదు చేసుకోవచ్చు లేదా సమీప రైతు సేవ కేంద్రం ద్వారా నమోదు చేసుకోవచ్చు. దీనికి కావలసిన పత్రాలు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబరు నమోదు చేసుకోవడం వలన పిఎం కిసాన్ పంటల బీమా మరియు ఇతర వ్యవసాయ పథకాలకు అర్హులవుతారు. రైతు ఐడి వ్యవసాయ భవిష్యత్తుకు భద్రత చేకూరుస్తుందని తెలిపారు.రబీ లో గ్రామాలలో సాగుచేసిన పంటల వివరాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ గాక మొక్కజొన్న, పొగాకు సాగు చేస్తున్నట్లుగా రైతులు తెలిపారు. కాలానుగుణంగా పంటల మార్పిడి, ప్రత్యామ్నాయ పంటలతోనే వ్యవసాయం లాభసాటిక మారుతుందని రైతులకు తెలియజేశారు. భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువులు వాడాలని సూచించారు. మన నేలలో భాస్వరం నిల్వలు పరిమితికి మించి ఉన్నాయని అందువలన భాస్వరం ఎరువును కరిగించి మొక్కకు అవసరమైన రూపంలో అందించే పాస్ఫో బ్యాక్టీరియా అను జీవన ఎరువులను వాడుకోవాలని తెలియజేశారు. చౌడు భూములకు తప్పనిసరిగా జిప్సం వేసుకోవాలని సూచించారు. సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. రైతులు పొగాకు సాగుని తగ్గించి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న మినుము సాగు చేయాలని సూచించారు.గ్రామంలో పంట సాగు చేస్తున్న ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కౌలు రైతులు సంబంధిత రెవెన్యూ శాఖ ద్వారా కౌలు రైతు గుర్తింపు కార్డులు పొంది ఈ పంట నమోదు చేయించుకోవచ్చు.కంపెనీల ద్వారా మొక్కజొన్న మరియు పొగాకు పండించే రైతులు తప్పనిసరిగా కంపెనీల నుండి ఒప్పంద పత్రాలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఎవరు కూడా నల్ల బర్లీ పొగాకు సాగు చేయవద్దని సూచించారు. ఎవరైనా నల్ల బర్లీ పొగాకు సాగు చేసినా లేదా ప్రోత్సహించినా వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి నర్సాయపాలెం మరియు గంగపాలెం గ్రామ రైతు సోదరులకు ఏపీ ఎఫ్ ఆర్ పోర్టల్ లో నమోదు చేపించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఫిబ్రవరి 10)

వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు తప్పకుండా తమ యొక్క రైతు సేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించి ఆధార్ తరహా 11 అంకెల రైతు విశిష్ట సంఖ్య కొరకు వెంటనే నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. వ్యవసాయ పథకాలు అయినటువంటి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, రాయితీపై సూక్ష్మ సేద్య, వ్యవసాయ పరికరాలు, అలాగే సబ్సిడీపై విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, ఎరువులు పొందుటకు రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని తెలిపారు. మండలంలో వ్యవసాయ భూమి కలిగి ఇతర ప్రాంతాలకు తాత్కాలిక వలస వెళ్లిన రైతులు కూడా ఈ విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ చేసుకునేలా గ్రామాలలో వ్యవసాయ సిబ్బందితో కలిసి మంగళవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. గ్రామ నాయకులు, పెద్దలు సహకారంతో వివిధ ప్రాంతాలకు జీవనోపాధి కోసం వలస వెళ్లిన రైతులను గుర్తించి వారందరికీ త్వరితగతిన విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలని రైతు సేవ కేంద్ర సిబ్బందికి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రసూల్, వ్యవసాయ శాఖ సిబ్బంది ఖదీర్ అహ్మద్, నవ్య, కళ్యాణి, ఈశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాలు ఎనిమిది గ్రామాలలో నెల రోజుల్లో పూర్తి చేస్తాం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 10)

రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాలు ఎనిమిది గ్రామాలలో నెల రోజుల్లో పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సిసిఎల్ ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మికి తెలిపారు. రీ సర్వేపై సి సి ఎల్ ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ లు, జేసీలతో మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాల జారీపై సమగ్ర ప్రణాళిక రూపొందించుకున్నామని జిల్లా కలెక్టర్ సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాలుండగా 10 గ్రామాలను ఎంపిక చేసుకున్నామన్నారు. 5,569 పాస్ పుస్తకాలు ఇవ్వాలని లక్ష్యంకాగా, ఇప్పటికే 4,236 పాస్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. 76.6 శాతం ఈకేవైసీ లక్ష్యానికి చేరుకున్నామని, మిగిలినవి నెల రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని సి సి ఎల్ ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలతో ప్రక్రియ జరగాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట, భూములు రికార్డులశాఖ ఏడి కెవి శేషగిరిరావు, అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.



# మహిళా చట్టాల అమలు అనుభవాలు న్యాయం కోసం మహిళలు సుదీర్ఘ పోరాటం పుస్తకావిష్కరణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 10)

దేశంలో మహిళలపై జరుగుతున్న వివక్ష, హింస, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడాలని, ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ప్రగశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పద్మ డిమాండ్ చేశారు. మహిళలు సాగించిన పోరాటాల అనుభవాలతో రచించిన పుస్తకాన్ని "మహిళా చట్టాల అమలు అనుభవాలు-న్యాయం కోసం మహిళలు సుదీర్ఘ ప్రయాణం" అనే పుస్తకాన్ని మాదాల నాగేశ్వర స్వామి భవన్ లో ఆవిష్కరించారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్న వాస్తవ పరిస్థితిని, వాటి అమలులో ఉన్న లోపాలను, పోలీస్-న్యాయవ్యవస్థల వైఫల్యాలను ఈ పుస్తకం బలమైన ఆధారాలతో వెలుగులోకి తీసుకొచ్చిందని చెప్పారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పని స్థలంలో అసమానత, కుల-వర్గ ఆధారిత వివక్ష వంటి అనేక సమస్యలపై మహిళలు ఎదుర్కొన్న అనుభవాలు ఈ గ్రంథంలో ప్రత్యక్ష అనుభవాలను పొందుపరచబడ్డాయి అని చెప్పారు. ఈ పుస్తకం మహిళలను కేవలం బాధితులుగా కాకుండా న్యాయం కోసం పోరాడిన యోధులుగా చూపిస్తుంది. చట్టాలు ఉన్నప్పటికీ న్యాయం పొందేందుకు మహిళలు ఎంతటి సుదీర్ఘ పోరాటం చేయాల్సి వస్తోందో ఈ గ్రంథం స్పష్టంగా తెలియజేస్తుంది అని చెప్పారు




అదే సమయంలో మహిళా ఉద్యమాల పాత్ర, సంఘటిత పోరాటాల ప్రాధాన్యతను కూడా ఈ పుస్తకం చాటిచెబుతోంది. పుస్తకావిష్కరణ సభలో మాట్లాడిన వక్తలు మాట్లాడుతూ మహిళా చట్టాల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించారు. బాధిత మహిళలకు న్యాయం అందించడంలో పోలీస్, న్యాయవ్యవస్థలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మహిళా చట్టాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, అమలుపై ప్రజా పర్యవేక్షణ ఉండాలని డిమాండ్ చేశారు. ఈ పుస్తకం మహిళా హక్కుల కార్యకర్తలకు, న్యాయవాదులకు, విద్యార్థులకు, సామాజిక ఉద్యమాలకు ఒక ముఖ్యమైన దిశానిర్దేశక గ్రంథంగా నిలుస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. న్యాయం దానంతట అదే దక్కదని, దానిని సాధించేందుకు సంఘటిత పోరాటమే మార్గమని బి పద్మ పిలుపునిచ్చారు. అలాగే ఫిబ్రవరి 12 తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ అంశాల మీదనే మార్చి 8 పిలుపు అమలు చేయాలని జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి మంజుల మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మ జాతీయ గ్రామీణ హామీ పథకాన్ని రద్దుచేసి విబి రాంజీ పథకాన్ని తీసుకురావడంలో పెద్ద కుట్ర దాగి ఉందని విమర్శించారు దీనికి నిధులను కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం పై ప్రధాన భారం పెట్టి పనులను కుదించే ప్రయత్నం చేశారన్నారు. దీనిని మహిళా సంఘం వ్యతిరేకిస్తుందన్నారు. గ్రామాల్లో పాత పద్ధతిలోనే మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే బెల్ట్ షాపులతో మద్యం గ్రామాల్లో విచ్చలవిడిగా విక్రయించబడుతుందని దీనిని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఫలితంగా గ్రామాల్లో యువత గంజాయి మద్యం బానిసలై నేర చర్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు శాఖమూరి భారతి, ఉపాధ్యక్షులు సిహెచ్ పద్మ, సహాయ కార్యదర్శి వై సుశీల, యరమాల కోటేశ్వరమ్మ, వి సుజాత, అమ్మాజీ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## కోట్లాది రూపాయలతో నగరం అభివృద్ధి, నగర అభివృద్ధికి నగర ప్రజలు సహకరించాలి

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 10)

నగరంలో ప్రధాన రహదారులైన ట్రంక్ రోడ్, కొత్తపట్నం బస్టాండ్ రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయం నందు కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఆయన కోట్లాది రూపాయలతో ఒంగోలు నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. నగర అభివృద్ధికి ప్రజలకు సహకరించాలని కోరారు. వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ట్రంక్ రోడ్,కొత్తపట్నం బస్టాండ్ రోడ్డు విస్తరణ పనులు చేపడతామని తెలిపారు.నష్టపోయిన వ్యాపారులకు టిడిఆర్ బాండ్ల ద్వారా పరిహారం అందిస్తామని తెలియజేశారు.నగరంలో 23 పార్కుల నందు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి వాటిని ఆధునీకరణ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ప్రతి డివిజన్ నందు 20 లక్షల రూపాయల వ్యయంతో కమ్యూనిటీ హాల్ ను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.6 నెలల కాలంలో అర్హులైన లబ్ధిదారులకు టిట్కో ఇళ్లను అందిస్తామని హామీ ఇచ్చారు.అమృత్ 2 పథకం పనులను మేఘా కంపెనీకి ఇవ్వడం జరిగిందని రెండు ఏళ్ల వ్యవధిలో పనులు పూర్తి అయిన వెంటనే నగర వాసులకు ప్రతిరోజూ త్రాగునీరు ఇచ్చే కార్యక్రమం చేపడతామని దామచర్ల పేర్కొన్నారు.

## శ్రీ నారాయణ స్వామి తిరునాళ్ల మహోత్సవ అహ్వాన పత్రికను ఆవిష్కరించిన టీడీపీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 10)

మహా శివరాత్రి సందర్భంగా ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ నారాయణ స్వామి తిరునాళ్ల మహోత్సవ అహ్వాన పత్రికను టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయబ్ రసూల్, గజ్జల కోటిరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకి, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 10)

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకి, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఇండేల లక్ష్మీరెడ్డి తెలిపారు. మంగళవారం సంతనూతల పాడు మండలం, పిడతల గుడిపాడులో అంగన్వాడీ కేంద్రం - 1 ,2 లను ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్వాడీ సెంటర్ 1లో 9 గంటలకి రావలసిన పిల్లలు 10:30 అయిన కూడా పిల్లలు రావకపోవటం పై, కోడి గుడ్లు నిల్వ ఉండటం, రిజిస్టర్‌లు సరిగా నిర్వహించకపోవటం వంటివి గుర్తించి అంగన్వాడీ టీచర్, సూపర్వైజర్ పై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత సూపర్ వైజర్ సావిత్రికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. పిడతల గుడిపాడు సెంటర్ 2లో విద్యార్థుల హాజరు పట్టికనుచూసి, తప్పుగా హాజరు వెయ్యటం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ అంగన్వాడీ కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటాం పైన ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇలా ఉంటే విద్యార్థులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకి, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత పెద్ద మొత్తం లో ఖర్చు చేస్తుంటే మీరు ఇలా చెయ్యటం పద్ధతి కాదని ఆయన చెప్పారు. సిడిపిఓలు, సూపర్ వైజర్‌లు నిరంతరం తనిఖీలు చేస్తూ అంగన్వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. పిడతల గుడిపాడులో ఎంపియుపి స్కూల్‌లో వంటశాల పెచ్చులు ఉండటంతో ఏజెన్సీ వాళ్ల ఇంటిలో వంట వండటం తో ఆయన అసంతృప్తి చేస్తూ, రేపటి నుండి పాఠశాల లోనే వంట వండి తనకి ఫోటోలు పెట్టాలని ఆదేశించారు.

**ఎర్రగుడిపాడులో....** ఎర్రగుడిపాడు గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీ చేశారు. ఎస్టి కాలనీ లోని అంగన్వాడీ కేంద్రం అసలు ఓపెన్ చెయ్యలేదని, ఎస్సి కాలనీలోని కేంద్రాల్లో పిల్లలు లేరు, పిల్లలకి, బాలింతలకు ఇచ్చే ఆహారం ఆహారం ఒక్కటి కూడా లేదని ఈ విషయం పై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులని ఆయన ఆదేశించారు. ఆయన వెంట సాంఘీక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, డిఎస్ఓ పద్మశ్రీ, డీఎం సివిల్ సప్లైస్ అధికారి వరలక్ష్మి, సమగ్ర శిక్ష జిల్లా బాలిక సంరక్షణ అధికారి కే హేమలత, తదితర అధికారులు ఉన్నారు.

## కెజి కండ్రిక గ్రామంలో పర్యటించిన జేసీ కల్పనాకుమారి







(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 10)

మండలంలోని కెజి కండ్రిక గ్రామంలోని సర్వే నంబర్ 60లో 7 ఎకరాల భూమిని మహాత్మా జ్యోతి రావ్ పూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర స్కూల్, హాస్టల్‌కు కేటాయించు నిమిత్తం మంగళవారం జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఇరిగేషన్ డిఈ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలిసి సంయుక్తంగా తనిఖీ చేసారు. అనంతరం ముప్పవరం గ్రామ పంచాయతీ కార్యాలయంను సందర్శించి గ్రామ విఆర్ఓలు, మండల సర్వేయర్లతో సమావేశమై పట్టాదారు పాసుపుస్తకాల ఈకెవైసి, కరెక్షన్ గురించి సమీక్షించారు. పట్టాదారు పాసు పుస్తకాల జారీలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట మండల రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 13న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి

ఎస్టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి టికేఎస్ ప్రసాద్, ఆర్ దేశా నాయక్ పిలుపు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 10)

ఐఆర్ మంజూరు బకాయిల చెల్లింపు సిపిఎస్ రద్దు తదితర ప్రభుత్వ మేనిఫెస్టో హామీల అమలు కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టియు రాష్ట్ర సంఘం ఇచ్చిన మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా రెండవ దశ లో ఫిబ్రవరి 13 వ తేదీన మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఎస్టియు ధర్నా కార్యక్రమానికి ఎస్టియు రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు, మండల నగరపాలక పురపాలక అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్.టి.యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి టికేఎస్ ప్రసాద్ ఆర్ దేశా నాయక్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్లకు ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఇచ్చిన క్రింది హామీలను అమలు పరచలేదని కావున వెంటనే క్రింది హామీలను అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి 30% ఐఆర్ ను ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకం పొందిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పోలీసులు, ఇతర శాఖల ఉద్యోగులకు ఓపిఎస్ అమలు చేయాలని పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ఇవ్వవలసిన గ్రాడ్యుటీ ని వెంటనే మంజూరు చేయాలని ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు చెల్లించాల్సిన 4 డిఏ లను వెంటనే చెల్లించాలి. రెండవ దశలో ఫిబ్రవరి 13 వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద జరిగే జిల్లాస్థాయి ధర్నా కార్యక్రమానికి ప్రభుత్వం స్పందించకపోతే మూడవ దశలో ఫిబ్రవరి 25 వ తేదీ జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి ఎస్టీయూ నాయకులు కార్యకర్తలు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్ల కు ఇచ్చిన మేనిఫెస్టో హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

### కుప్పం అభివృద్ధి ప్రాధికారిక సంస్థ చైర్మన్ కంచర్ల శ్రీకాంత్‌కు ఘన స్వాగతం పలికిన ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్






(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 10)
ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ ఆహ్వానం మేరకు, ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు, కుప్పం ప్రాంత అభివృద్ధి ప్రాధికారికారిక సంస్థ చైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న ఏఆర్ రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కంచర్ల శ్రీకాంత్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించి ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మా కార్యాలయానికి మీరు విచ్చేయడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన మీరు చంద్రబాబు నియోజకవర్గంలో కుప్పం ప్రాంత అభివృద్ధి ప్రాధికారిక సంస్థ చైర్మన్‌గా నియమితులవడం మన జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కంటా కోటయ్య, గుత్తి మహేష్, జాజం మధు, వేముల జయరాములు, బత్తుల సుబ్బారావు, దాసరి రమణయ్య, బొమ్మినేని రవి, పెద్దిశెట్టి గణేష్, పత్తి వెంకటేశ్వర్లు, దుర్గం శ్రీకాంత్, వేముల రమేష్, కేశవ రాయి విష్ణు వర్ధన్, ఒంగోలు బాబు, రాజు, పావులూరి సూరి, తియ్యపిండి కార్తీక్, గోసుల సురేంద్ర, కంపా పెంచలయ్య, గంజిగుంట్ల సుధాకర్, గంజిగుంట్ల సుబ్రహ్మణ్యం, పలువురు పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

### రైతులే స్వయంగా పంట నమోదు చేసుకోవచ్చు
### ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మండల వ్యవసాయాధికారి బి సంగమేశ్వరరెడ్డి




(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఫిబ్రవరి 10)
మండలంలోని అన్నసముద్రం, మేడపి గ్రామం లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా మండల వ్యవసాయ అధికారి బి సంగమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 20 వ తారీకు పంట నమోదు కు చివరి తేదీ అని తెలిపారు. కావున రైతులు అందరు రబీ సీజన్ లో పంటనమోదు చేయించుకోవాలిని తెలిపారు. ఈ సారి రైతులే ~~మా~~×మీా 2.0 యాప్ ను ప్లే స్టోర్ నందు డౌన్లోడ్ చేసుకొని రైతు లాగిన్ లో లాగిన్ అయ్యి రైతులే స్వయంగా పంట నమోదు చేసుకోవాలి అని సూచించారు. రైతులందరు కూడా రైతు ఐడి, (భూ ఆధార్) తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు. సంక్షేమ పథకాల జీవనాడి, రైతు ఐడి, అని తెలియచేసారు. అదే విధంగా గ్రామంలోని వరి, మొక్కజొన్న పంటలను సందర్శించి, పంటలోని తెగుళ్లు, పురుగులు వాటి ప్రభావం పై ఎటువంటి చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలో రైతులకు తెలియచేసారు. అదే విధంగా వరిలో కాండం తోలుచు పురుగు ఉదృతి కనిపించంచడం జరిగింది. కాండం తోలుచు పురుగు నివారణకు 3 జి గుళికలను 10 కేజీలు ఎకరానికి చల్లు కోవాలని సూచించరు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామం పెద్దలు అదేవిధంగా గ్రామ వ్యవసాయం సహాయకులు పి లాలు నాయక్, మురళి పాల్గొన్నారు.

### మహాప్రస్థానం వాహన సేవలు అమలు చేయాలి



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 10)
జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన వారిని ఇంటికి తరలించుటకు మహాప్రస్థానం వాహన సేవలు అమలు చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆర్థికంగా వెనుకబడిన మృతుల కుటుంబాలకు ఈ సౌకర్యమును కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ సేవలు బాపట్ల జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలలో, ఏరియా వైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# 129 అంశాలకు కౌన్సిల్ ఆమోదం















(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 10)
ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగింది. నగరపాలక సంస్థ ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పాటు అధికార టీడీపీ, మిత్రపక్షం జనసేన, ప్రతిపక్ష వైసిపి పార్టీకి చెందిన కార్పొరేటర్లు పాల్గొన్నారు. సమావేశానికి అవసరమైన కోరం సభ్యులు ఉండడంతో 130 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ నందు ప్రవేశ పెట్టారు. అజెండా నందు ఒక అంశం మినహా అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. అజెండా నందు ప్రధాన అంశాలు అయిన ట్రంక్ రోడ్ విస్తరణ అంశం 3తో పాటు మస్తాన్ దర్గా నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు గల రోడ్డు విస్తరణ పనులకు సంబందించిన అంశం 107 లకు సభ ఆమోదం తెలిపింది. పలు అంశాలకు చెందిన విషయాలపైన వైసిపి కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్ కు టీడీపీ కార్పోరేట్లర్ల అబ్బూరి శ్రీనివాసరావు, తిప్పరపల్లి రవితేజ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నక్ష కార్యక్రమంలో పేరుతో ఇంటింటికి నంబర్ల వేసే కార్యక్రమానికి 20 లక్షల పనికి 80 లక్షలు కేటాయించడం ఏమిటని వైసీపీ సభ్యులు తమ అభ్యంతరాన్ని లేవనెత్తగా టీడీపీ కార్పొరేటర్లు దీటుగా బదులిచ్చారు. రైల్వే అండర్ పాస్ పనులు జరుగుతున్న నేపథ్యంలో 16వ డివిజన్ ప్రజలకు త్రాగునీరు సరఫరా విషయంలో కొంత ఇబ్బంది ఏర్పడుతుందని పార్టీలకు అతీతంగా త్రాగునీరు సరఫరా చేయాలని వైసీపీ కార్పొరేటర్ మాట్లాడాన్ని టీడీపీ కౌన్సిల్ సభ్యులు ఖండించారు. త్రాగునీటి సరఫరా విషయంలో పార్టీలు ఉండవు అని ఆది ప్రజా అవసరం అన్న విషయాన్ని వైసీపీ సభ్యులు గుర్తుఎరుగాలని హెచ్చరించారు. పాత మార్కెట్ నందు పీపీపీ విధానంతో చేపట్టే అభివృద్ధి పనులను వాయిదా వేసారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఇంజనీర్ ఐసయ్య, మెడికల్ అధికారి వైష్ణవితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జయప్రదంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఫిబ్రవరి 10)
జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జయప్రదంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్నికి సంబంధించి రూపొందించిన గోడపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే నులి పురుగులను కచ్చితంగా నిర్మూలించాలని కలెక్టర్ చెప్పారు. ఈనెల 17వ తేదీన జిల్లా స్థాయిలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మూడు నుంచి 18 సంవత్సరాలలోపు చిన్నారులందరికీ నులిపురుగుల మాత్రలు పంపిణీ చేయాలన్నారు. అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలు, ఒకేషనల్ విద్యాసంస్థలు, బాలల సంరక్షణ కేంద్రాలు, బాలసదన్, నర్సింగ్ కాలేజీ, డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు, పారా మెడికల్, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలు, బడి బయట ఉన్న పిల్లలందరికీ ఈ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో 3,29,850 మంది చిన్నారులకు నులి పురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఇదే క్రమంలో చేతులు శుభ్రంగా కడుగుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పోషణ లోపం ఉన్న వారికి తప్పనిసరిగా ఈ మాత్రలు ఇవ్వాలన్నారు. అలాగే రక్తహీనత నివారణపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఒకే రోజు దేశమంతా మందులు పంపిణీ జరుగుతుందని, విద్యార్థులు భోజనం చేసిన తదుపరి ఇవ్వాలన్నారు. వాటిని నమిలి మింగాలనే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. భోజనం చేసిన తదుపరి అర్థగంట లోగానే మాత్రలు వేసుకునేలా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించే బాధ్యత అధికారులు, ప్రధానాచార్యులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఇన్చార్జి డిపిఓ లవన్న, డిఆర్‌డిఏ పీడీ బి సింగయ్య, డీఈవో శ్రీనివాస్ సింగ్, మలేరియా అధికారి సోమ్లా నాయక్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షల ఉత్తీర్ణతలో బాపట్ల జిల్లాను టాప్3లో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 10)
ఇంటర్మీడియట్ పరీక్షల ఉత్తీర్ణతలో బాపట్ల జిల్లాను టాప్3 లో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. విద్యారంగం అభివృద్ధి అంశాలపై విద్యాశాఖ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి హైబ్రిడ్ మోడ్ లో ఆయన సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేకంగా అధ్యయన తరగతులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తీర్ణత శాతం మరింత పెరగడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 23వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్న తరుణంలో జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, 400 మంది విద్యార్థులు గైర్హాజర్ పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్చూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 83 మంది విద్యార్థులకు గాను 62 మంది మాత్రమే హాజరవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన కళాశాలలలోను ఇదే మాదిరి కారణాలు లేకుండా విద్యార్థులు గైర్హాజరవడం, నిర్లిప్తంగా వ్యవహరించడంపై అసహన వ్యక్తం చేశారు. ముందస్తుగా నిర్వహించిన ప్రీ పబ్లిక్ పరీక్షలలో చెరుకుపల్లి మండలం కావూరు జూనియర్ కళాశాలలో 91 విద్యార్థులు హాజరు కాగా, 33 మంది ఫెయిల్ అవ్వడం ఏమిటని నిలదీశారు. చీరాలలో 39 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని కళాశాలల ప్రధానాచార్యులు, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఓను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి కళాశాలల ప్రధానాచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది ఎఫ్ ఆర్ ఎస్ హాజరు నివేదించాలన్నారు. అధికారులే బాధ్యతారహిత్యంగా పనిచేస్తుంటే పిల్లలు ఎలా చదువుకుంటారని కలెక్టర్ నిలదీశారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలి, అలాగే నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యతను ప్రధాన ఆచార్యులు విస్మరించడం మంచి పద్ధతి కాదన్నారు. వారి ఎదుగుదలకు తోడ్పాటును అందించాలన్నారు. మీ నిర్లిప్తత విద్యార్థులకు శాపంగా మారకూడదన్నారు. కళాశాలల ప్రధానాచార్యులు, అధ్యాపకులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇప్పటివరకు విద్యార్థుల పట్ల శ్రద్ధ లేకపోవడంతోనే ఫలితాలు తక్కువగా వస్తున్నాయన్నారు. సమగ్ర ప్రణాళికతో అధికారులు ముందుకు నడవాలని సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్ కింద ప్రభుత్వ పాఠశాలల్లో 437 పనులకు రూ.29 కోట్ల నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఆసౌకర్యం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు నైపుణ్యాలపై శిక్షణలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉద్యోగమేళాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో శ్రీనివాస్ సింగ్, ఇంటర్మీడియట్ బోర్డ్ జిల్లా అధికారి జుబేర్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి కె.సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రధానాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

## రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య







(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 10)

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర మారి టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పొదిలి ప్రభుత్వ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పాకాల బీచ్ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. రాష్ట్ర మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గం పరిధిలోని పాకాల బీచ్ రాష్ట్రంలో మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో విస్తారమైన తీర ప్రాంతం ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పాకలలో ఈనెల 14 15 తేదీల్లో జరిగే బీచ్ ఫెస్టివల్ లో జయప్రదం చేయాలని కోరారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పాకల బీచ్ ఎంతో సుందరంగా ఉంటుందన్నారు. ఈ బీచ్‌ని రాష్ట్ర





ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నామని ఈ నెల 14,15 తేదీలలో పాకాల బీచ్‌లో పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, హెలికాప్టర్ రైడింగులు, వివిధ రకాల బోట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు బీచ్ ఫెస్టివల్‌కు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పాకాల బీచ్ తర్వాత మరింత పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఆసియా ఖండంలో అతిపెద్ద చెరువు అయిన కంభం చెరువును మరొక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరు ఎలక్షన్ బాబు, దర్శి టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి లలిత్ సాగర్ మాట్లాడుతూ బీచ్ ఫెస్టివల్‌ను ప్రతి ఒక్కరూ తిలకించి ఆనందాన్ని పొందాలన్నారు. అనంతరం బెలూన్‌లు గాలిలోకి వదిలి 2కే రన్ ప్రారంభించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కాపురం డిప్యూటీ డిఈఓ ఎం శ్రీనివాసులు, పొదిలి మండల తహశీల్దార్ ఎం వి కృష్ణారెడ్డి, పొదిలి, మర్రిపూడి ఎంపీడీవోలు ఏ శ్రీనివాసరావు, ఎస్‌కే నాగూర్ షరీఫ్, పొదిలి ఏఎంసీ చైర్మన్ సయ్యద్ ఇమాంసా, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పొదిలి, మర్రిపూడి మండలాలకు చెందిన టిడిపి నాయకులు ఆవులూరి యలమంద, గునుపూడి భాస్కర్, వరికుంట్ల అనిల్, కాటూరి నారాయణ ప్రతాప్, సామంతపూడి నాగేశ్వరరావు, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తానికొండ వెంకట్రావు, షేక్ రసూల్ మహమ్మద్, మీగడ ఓబుల్‌రెడ్డి, యర్రమోతు శ్రీనివాసులు, ముల్లా ఖుద్దూస్, కాటూరి హనుమంతరావు, కాటూరి శ్రీను, షేక్ కాలేషా, చాగంటి వెంకట్రావు, షేక్ గౌస భాష, డాక్టర్ స్వర్ణ గీత, సోమిశెట్టి శ్రీదేవి, కార్యకర్తలు, పట్టణంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



# భక్తులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 10)

జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రాలలో మహా శివరాత్రి సందర్భంగా సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ ఎటువంటి అసౌకర్యం లేకుండా చక్కని దైవ దర్శనం కలిగేలా మహా శివారాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఒంగోలు కలెక్టరేట్లోని విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజబాబు, రెవెన్యూ, పోలీసు, దేవాదాయశాఖ అధికారులతో వర్చువల్‌గా సమావేశమై ఈ నెల 15న మహా శివారాత్రి సందర్భంగా జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రాలలో చేపట్టవలసిన మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పై దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో మహా శివరాత్రి సందర్భంగా వచ్చే సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ ఎటువంటి అసౌకర్యం లేకుండా మహా శివారాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలన్నారు. భైరవకోన, త్రిపురాంతకం, రామతీర్థం వంటి ప్రముఖ శైవ క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు అవుతారని, అందుకనుగుణంగా దర్శన క్యూ లైన్లు, తాగునీటి సరఫరా, ఆహారం, పటిష్ట ఏర్పాట్లు, పార్కింగ్, బందోబస్తు, పారిశుద్ధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు, సీసీ కెమెరాలను ఈ కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయడం, క్యూ లైన్ల క్రమబద్ధీకరణ, భక్తుల సౌకర్యార్ధం అవసరమైన పీఏ సిస్టం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పి కార్యాలయం నుండి జిల్లా ఎస్పి వి హర్షవర్ధన్‌రాజు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో మహా శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ నుండి జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, దేవాదాయ సహాయ కమీషనర్ పానకాలరావు, డిపిఓ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, క్షేత్ర స్థాయి నుండి రెవెన్యూ, పోలీసు, దేవాదాయశాఖలకు చెందిన డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.




# మార్చి 31 లోగా రైతులు రుణాలు చెల్లించాలి

### రైతులకు అతి తక్కువ వడ్డీకే రుణాలు
### ప్రతి రైతుకు రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం
### జీడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు వెల్లడి





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 10)

రైతులు తాము తీసుకున్న రుణాలను ఈ ఏడాది మార్చి 31వ తేదీలోగా బ్యాంకులకు తిరిగి చెల్లించాలని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు విజ్ఞప్తి చేశారు. వినుకొండ పట్టణంలోని సొసైటీ బ్యాంకులో ఆయన విలేకరులతో మాట్లాడారు. వినుకొండ నియోజకవర్గంలో సొసైటీలు ద్వారా 11 వేలమంది రైతులకు క్రాప్, సీసీ, ఎల్డీ రుణాలు అందించినట్లు తెలిపారు. బ్యాంకుల ద్వారా 290 కోట్లు సొసైటీల ద్వారా, బ్యాంకుల నుంచి 180 కోట్లు వినుకొండ నియోజకవర్గం లో రుణాలు అందించినట్లు తెలిపారు. రైతులకు అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చి ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు మక్కెన. ప్రతి రైతుకు మూడు లక్షల రూపాయల రుణాలు ఇవ్వడం జరుగుతుందని మొదటి లక్ష రూపాయలకు ఎటువంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదని మక్కెన తెలిపారు. రైతులు జిడిసిసి బ్యాంకులో సొసైటీల ద్వారా రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సకాలంలో రుణాలు చెల్లించినట్లయితే వడ్డీ తక్కువగా రుణాలు పొందే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

# రెడ్డయ్య మఠం వీధిలో నూతన సిసి రోడ్డు నిర్మాణం

### పాత విద్యుత్ స్తంభాల తొలగింపు
### నూతన రోడ్డు నిర్మాణం





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 10)

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డయ్య గారి మఠం వీధిలో ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు లేనందున, కరెంటు స్తంభాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను వార్డు ప్రజలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు, బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జ్ రితీష్ కుమార్‌రెడ్డి ల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల విజ్ఞప్తికి స్పందించిన వారు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి, అవార్డులో నూతన సిసి రోడ్డుతో పాటు అక్కడ ఉన్న పాత కరెంటు స్తంభాలను తొలగించి అదే స్థానంలో కొత్త కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమాన్ని బద్వేల్ మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణ యాదవ్, 33వ వార్డు కౌన్సిలర్ మిత్తికాయల సునీత యాదవ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్లను మొదలుపెట్టారు. ఎన్నాళ్ల నుంచో ఉన్న సమస్య పరిష్కారం కావడంతో స్థానిక వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ పనిని సాధ్యం చేసిన నాయకులు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా సాయిబాబా అలయు 10వ వార్షికోత్సవం







(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 10)
మండలంలోని కొత్తపాలెం పంచాయతీ మున్నంవారిపాలెం రైల్వే గేటు సమీపంలోని వేంచేసివున్న శ్రీ షిర్డి సాయిబాబా ఆలయ 10వ వార్షికోత్సవ వేడుకలు అలయనిర్వాహక దంపతులు లలితా శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో మంగళవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నూండే సాయిబాబాకు కాకడహారతి, అష్టోత్తర శతకళశాభిషేకం, అలంకరణ, అర్చనలు, నిత్యహోమాలు, పూర్ణాహుతి, దూప హారతీ తదితర పూజా కార్యక్రమాలు, పల్లకి సేవ కార్యక్రమలు అలయ పూజరుల అధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా సాయి బాబా విగ్రహానికి వివిధ పూలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుకున్నాయి. తెల్లవారుజాము నూండే పరిసర ప్రాంతా గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో సాయిబాబాను దర్శించుకుని బాబా ఆశీస్సులు పొందారు.మధ్యాహ్నం పూజ అనంతరం వందలాది భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమీప గ్రామల భక్తులు, పెద్దలు, ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ప్రజావేదిక





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 10)
మండల కేంద్రమైన ఉలవపాడు ఉపాధి హామీ పథకం కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక ఏర్పాటు చేయడం జరిగింది. మండలంలోని 12 గ్రామపంచాయతీలో జరిగిన 2024 -2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, సర్ఫ్ పెన్షన్లు, పైన తనిఖీ నిర్వహించడం జరిగింది. దీనికి సంబంధించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 22- 01- 2025 నుండి 09- 01- 2026 వరకు గ్రామాలలో జరిగిన సామాజిక తనిఖీ గురించి ప్రజావేదిక ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మీటింగ్ కు రామాయపట్నం ఫీల్డ్ అసిస్టెంట్ బాలకోటయ్య హాజరు కాకపోవడంతో పిడి అతన్ని విధులు నుండి తప్పించడం జరిగింది. అదేవిధంగా అధికారులకు మెమోలు ఇవ్వడం జరిగింది. ఈ సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరంలో పిడి గంగాభవాని, విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి , ఎంపీడీవో సురేష్ బాబు, ఏపీవో అబ్దుల్లా, సిఎల్ఆర్‌సి బాబురావు, ఏపీడి శ్రీనివాసరావు, వివిధ గ్రామాల ఉపాధి శ్రామికులు, నాయకులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా అయ్యప్ప ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలు







(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 10)
మండలంలోని సోపిరాల నందు వేంచేసిన శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ఐదవ వార్షికోత్సవ వేడుకలు మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మలపెంట సీతారామాంజనేయుల దంపతులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం అట్టహాసంగా జరిగాయి. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సమీప గ్రామల మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండే అలయ పూజరులు, గురుస్వామిల ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, హోమం, పుష్పార్చన, మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయం నందు నిర్వహించిన హోమం నందు ఆలయ ధర్మకర్త టిఎస్ఆర్ ఆంజనేయుల దంపతులు, పలువురు దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం వేలది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావును ఘనంగా సన్మానించిన మేయర్, కార్పొరేటర్లు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 10)
నగర అభివృద్ధికి సహాయపడుతూ, మున్సిపాలిటీకి ఎక్కువ నిధులు వచ్చేందుకు కృషి చేసినందుకు, ర్యాంకుల్లో ఒంగోలు మొదటి స్థానం వచ్చినందుకు ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు కి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం అయిపోయిన అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావుకి, మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, మున్సిపల్ కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, అధికారులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు.








## రీసర్వే పట్టాదార్ పాస్‌పుస్తకాలు పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలి

### సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 10)
రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల



కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని, నాణ్యత ప్రమాణాలతో ప్రక్రియ జరగాలని ఆమె స్పష్టం చేశారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ పి రాజాబాబు ఇందులో పాల్గొన్నారు. జిల్లాలో సాధించిన పురోగతిని, లక్ష్యానికి చేరుకునేలా చేపట్టిన చర్యలను ఆయన వివరించారు.

మండలస్థాయి అధికారులతో కలెక్టర్....

మున్సిపల్ కమిషనర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ మంగళవారం ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందతున్న సేవలు, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షర ఆంధ్ర కార్యక్రమం, పారిశుద్ధ్యము, హౌసింగ్, తాగునీటి సరఫరా, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన పనుల పురోగతి, పీ - 4 బంగారు కుటుంబాలు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. సేవలలో నిర్లక్ష్యం ఉండకూడదని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలలో జిల్లా ప్రగతి మెరుగ్గా ఉండాలని స్పష్టం చేశారు.

## అట్టహాసంగా పాకల బీచ్ రీల్ ఆవిష్కరణ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 10)
ఈ నెల 14, 15 తేదీలలో సింగరాయకొండ మండలం పాకల బీచ్‌లో నిర్వహించే ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించిన ప్రమోషన్ రీల్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం రాత్రి నగరంలో అట్టహాసంగా జరిగింది. అద్దంకి బస్టాండు సెంటర్లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మున్సిపల్ కమిషనర్ కె వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. చరిత్రలో నిలిచిపోయే స్థాయిలో నిర్వహించే ఈ ఉత్సవంలో కుటుంబసమేతంగా పాల్గొనాలని జిల్లా ప్రజలకు వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లను ఈ సందర్భంగా వివరించారు.







# సైనికుల త్యాగాలతో దేశం సురక్షితం
# వారి సేవలకు బిగ్ సెల్యూట్





తీర ప్రాంత పరిరక్షణలో సీఐఎస్ఎఫ్ పాత్ర కీలకం
దేశ సమగ్రతను కాపాడుదామని పిలుపునిచ్చిన
ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులి
సైనికుల సాహస యాత్రను ప్రశంసించిన ఎమ్మెల్యే
సీఐఎస్ఎఫ్ సైకిల్ యాత్రకు ఉలవపాడులో అపూర్వ స్వాగతం










(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 10)
వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో దేశ ఐక్యతను చాటుతూ 130 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల ఆధ్వర్యంలో చేపట్టిన కోస్టల్ సైక్లోథాన్ మంగళవారం మధ్యాహ్నం ఉలవపాడుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు అధికారులు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సైనికులకు ఘన స్వాగతం పలికారు. విద్యార్థుల కోలాటం నడుమ ప్రతి ఒక్కరికి పుష్పగుచ్చాలు అందిస్తూ హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ హైస్కూల్లో జరిగిన సభలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ 6,500 కిలోమీటర్ల దూరం సైకిల్ యాత్రకు పూనుకోవడం పెద్ద సాహసమని అన్నారు. దేశ ఐక్యతను చాటిచెప్పేలా యాత్ర నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. సముద్ర మార్గం ద్వారా ఉగ్రవాదులు ముంబైలోకి ప్రవేశించి మారణ హోమానికి పాల్పడిన విషయాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు గుర్తుచేస్తూ దేశ భద్రత విషయంలో మోడీ ప్రభుత్వం మరింత కట్టిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజలంతా సురక్షితంగా, ప్రశాంతంగా జీవనం గడపటానికి... సైనికుల త్యాగాలే కారణమన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే దేశభక్తిని పెంపొందించుకొని, దేశ సేవలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ ఎస్డిఎస్సి షార్, శ్రీహరికోట సీనియర్ కమాండెంట్ ఎస్హెచ్ సంజీట్ కుమార్, కందుకూరు డివిజనల్ పోలీస్ అధికారి సిహెచ్ విబి సుబ్రహ్మణ్యం, కందుకూరు సీఐ ఎస్కె అన్వర్ భాష, ఉలవపాడు ఎస్ఐ జి సుబ్బారావు, డాక్టర్ సునీల్ కుమార్, సిఎంఓ, సిఐఎస్ఎఫ్, అధికారులు, మండల తహసిల్దార్ టి శ్రీనివాసులు, మండల ఎంపీడీవో బి సురేష్, కూటమి పార్టీ నేతలు, ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

# ఉగ్ర ఆధ్వర్యంలో ఉత్సాహంగా 2కే రన్











(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 10)
ఈ నెల 14, 15 తేదీల్లో సింగరాయకొండ మండలం పాకలలో బీచ్ ఫెస్టివల్లో భాగంగా 2కే రన్ కార్యక్రమం కనిగిరిలో ఎమ్మెల్యే ఉగ్ర ఆధ్వర్యంలో మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. 2కే రన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముందుగా జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న బీచ్ఫెస్టివల్ కార్యక్రమానికి యువత పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కనిగిరిలో నిర్వహించిన 2కే రన్ కార్యక్రమానికి ఇంత పెద్ద ఎత్తున యువత తరలిరావడం ఆనందదాయకమన్నారు. ఏపి టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టూరిజం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పర్యాటక రంగం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశాలున్నాయన్నారు. పర్యాటక రంగం పై పెద్ద ఎత్తున ప్రభుత్వం దృష్టి పెట్టడం వలనే బీచ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఈ నెల 14, 15 తేదీల్లో పాకల బీచ్లో బీచ్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కనిగిరి నుండి పాకలకు ఉచితంగా బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బీచ్ ఫెస్టివల్కు వచ్చే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్తానిక విద్యుత్శాఖ కార్యాలయం నుంచి ఓవి రోడ్డు గుండా పామూరు బస్టాండ్, అమరావతి గ్రౌండ్, ఆంజనేయస్వామి ఆలయం దగ్గర హైవే వరకు ఈ 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల, కాలేజీ విద్యార్తులతో పాటు టీడీపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య




(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 10)
కుటుంబ కలహాల నేపథ్యంలో మానసిక క్షోభతో కర్రి ఉమా(33) అనే మహిళ మండలంలోని కోత్తపాలెం నందు మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చిన్నగంజాం మండల ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు మేరకు




కుటుంబ సమస్యల కారణముగా తన ఇద్దరు కుమారులతో నివసిస్తు సోమవారం రాత్రి సమయములో ఆమె నివాసము ఉంటున్న రేకుల ఇంటిలోని ఇనుప పైపుకు చున్నీతో ఉరివేసుకుని చనిపోవడం జరిగిందన్నారు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకై పంపించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


## భక్తులకు అసౌకర్యం కలగకూడదు
## సిఐ రాజేష్‌కుమార్





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 10)
మహాశివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సిఐ రాజేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక నిర్మామహేశ్వర దేవాలయాన్ని ఆయన సందర్శించారు. భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్ల పై చైర్మన్కు పలు సూచనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, వారికి కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఏదైనా ఇబ్బంది కలిగితే పోలీసులు అందుబాటులో ఉంటారని, వారి సహాయంతో సమస్య పరిష్కారం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసి క్యూలైన్కు భక్తులు ఎదురుగా రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరి పై ఉందన్నారు. కావున భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్వామివారి దర్శనం కల్పించాలని కోరారు. సిఐ వెంట చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, ఆలయ పూజారులు, సిబ్బంది ఉన్నారు.

## సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను సందర్శించిన ఒంగోలు పార్లమెంటు వైసీపీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 10)
కనిగిరిలో నూతనంగా నిర్మించిన సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంగళవారం ఒంగోలు పార్లమెంట్ వైస్సార్సీపీ పరిశీలకులు, పార్టీ సీనియర్ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వైస్సార్సీపీ నాయకులు, సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్ అధినేత డాక్టర్ పెరుగు మురలీ కృష్ణ యాదవ్‌తో ఆయన సుదీర్ఘంగా భేటి అయ్యారు.
వెనుకబడిన ప్రాంతంలో అన్ని హంగులతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించి ప్రజలకు సేవ చేస్తున్న డాక్టర్ పెరుగు మురళి కృష్ణ యాదవ్‌ని ఆయన అభినందించారు.

# బ్రహ్మనాయుడు దుష్ప్రచారం మానుకోవాలి

## జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు




(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 10)
మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దుష్ప్రచారం చేయటం మానుకోవాలని జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు హితవుపలికారు. మంగళవారం స్థానిక చీఫ్ విప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు రాజకీయ స్వార్థం కోసం అసత్యాలు ప్రచారం చేయటం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి, ప్రజలకు మంచి పాలన అందిస్తుందటే ప్రతిపక్ష పార్టీ నాయకులకు అవి కనపడకపోవటం బాధాకరమన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు చొరవతో దశాబ్ధాల నుండి పరిష్కారం కాని ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు నిజాలు తెలుసుకోవాలని సూచించారు. జగన్ కాలనీలో ట్రాన్సఫార్మర్లు తెచ్చి వినుకొండలో ఏర్పాటు చేయటం అన్నది పచ్చి అబద్ధమని, నాలుగు ట్రాన్సఫార్మర్లలో మూడు గుంటూరు నుండి తీసుకురాగా, మరొకటి షిఫ్టింగ్ చేశామన్నారు. వేల్పూరులో కోల్డు స్టోరేజ్కి గత ఏడాది నుండి 24 గంటల కరెంటు ఇస్తుంటే కరెంటు లేదని ప్రచారం చేయటం ఏమిటని మక్కెన నిలదీశారు. పింఛన్ల పెంపు, ఉచిత బస్సు, తల్లికి వందనం వంటి పథకాలతోపాటు పోలవరం, అమరావతి నిర్మాణానికి వేలకోట్లు ఖర్చుపెడుతున్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. లడ్డు కల్తీలో శ్రీ వేంకటేశ్వరస్వామి కూటమి నాయకులకు బుద్ధి చెప్పటం కాదని, లడ్డు కల్తీకి పాల్పడిన వైసీపీకి ఇప్పటికే వేంకటేశ్వరస్వామి ఘోరమైన శిక్ష విధించినా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని ధ్వజమెత్తారు. హిందువుల మనోభావాలు కాపాడటం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తిరుమల లడ్డు కల్తీని నిగ్గుతేల్చి తిరుమల ప్రక్షాళన చేసి స్వామివారి ఔన్నత్యాన్ని కాపాడతామన్నారు. సిబిఐ, సిట్ రిపోర్టు ప్రకారం నెయ్యిలో కల్తీ జరగలేదని వైసీపీ నిరూపించగలదా? అని ప్రశ్నించారు. అపనిందలు వేయాల్సిన అవసరం కూటమి ప్రభుత్వానికి లేదు...అపచారం చేసిన వైసీపీకే ఆ అవసరం వచ్చిందిదని చెప్పారు. ఘర్షణలు, గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు భంగం కలుగజేసైనా రాజకీయ ఉనికి కోసం వైసీపీ ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. తొందరపాటు...పొరపాటు... అని ముఖ్యమంత్రిని ఇష్టాసారం మాట్లాడితే సహించేది లేదు...తప్పు ఎవరు చేసినా తప్పు కాకుండా పోదన్నారు. వినుకొండ పట్టణంలోని ఎన్ఎస్పీ స్థలాలను అభివృద్ధి చేసి పట్టణానికి తలమానికంగా మారుస్తామని స్పష్టం చేశారు. యూరియా కొరత లేదని, రైతులకు పంటలు బాగా పండాయని ప్రతిపక్షాలు పనిగట్టుకొని తప్పుకు ప్రచారం చేస్తుందన్నారు.దాసయ్య, పత్తి పూర్ణ, రోశయ్య, అంజిరెడ్డి, విశ్వనాథం, తిరుమల శెట్టి బాలయ్య, పెసలు వెంకటనారాయణ, సొసైటీ అధ్యక్షులు, క్లస్ట రు ఇన్చార్జులు.. తదితరులు పాల్గొన్నారు

## గ్రూప్1 విజేతను సత్కరించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 10)
మండలంలోని వీరేపల్లి గ్రామానికి చెందిన గొల్లపూడి ఉదయ్ కుమార్ ఇటీవల గ్రూప్-1 కు సెలెక్ట్ అయ్యి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఉద్యోగం సంపాదించాడు. ప్రస్తుతం సామర్లకోటలో అసిస్టెంట్ రైల్వే స్టేషన్ మాస్టర్గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం తన కార్యాలయానికి పిలిపించుకుని ఉదయ్ కుమార్ను ప్రత్యేకంగా అభినందించారు. చిన్న కుటుంబంలో పుట్టి, కష్టపడి చదివి, భవిష్యత్తును తీర్చిదిద్దుకున్నారని ప్రశంసించారు. గతంలో కూడా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు సెలెక్ట్ అయిన విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఉదయ్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకుడు లక్కంరాజు నరేష్, మోడల్ స్కూల్ ఛైర్మన్ ప్రభాకర్, పార్టీ నాయకులు సత్యం, గురవయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.76 కోట్ల పన్ను బకాయిలు



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 10)
మున్సిపాలిటీ పరిధిలో గల దాదాపు 60నుంచి 70 ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు త్వరగా వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న దాదాపు 60 మంచి 70 ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలను విడుదల చేశారు. వీటి విలువ 1,76,55,635 రూపాయలు ఉన్నట్లు తెలిపారు. అలాగే ఈ బకాయిలు 2001 నుంచి కూడా కొన్ని కార్యాలయాల బకాయిలు ఉన్నట్లు మున్సిపల్ శాఖ లెక్కలు చూపుతుంది. ఇందులో పోలీసు క్వార్టర్స్, సాంఘీక సంక్షేమం ఆర్అండ్బి, ఇరిగేషన్, ఆర్జీవో, ఎన్టీవో హోమ్, ఆర్డీవో కార్యాలయం, విద్యాశాఖ ఇంజనీరింగ్, మండల పరిషత్, మండల రెవెన్యూ, ఆటవిశాఖ పంచాయతీరాజ్, సాంఘీక సంక్షేమం, సబ్ ట్రెజర్, సివిల్ సప్లయిస్ గోడౌన్, పోస్టాఫీస్, ఎస్టీవోటీ కార్యాలయం తదితర కార్యాలయాలు ఉన్నట్లు వారు తెలిపారు. అత్యధికంగా 41 లక్షలు పై బడి బకాయిలు' ఉండగా మిగిలిన శాఖలు కూడా లక్షలలో బకాయిలు పడ్డట్లు తెలుస్తోంది. సకాంలంలో పన్నులు చెల్లించేందుకు సంబంధితశాఖాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వివిద శాఖల అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# ఎంపీపీ విలువల్లేని రాజకీయాలు మానుకోవాలి

### అధికారులు, ఎంపీపీ ఎటువంటి సమాచారం ఎంపీటీసీలకు ఇవ్వలేదు

### ఐదు మంది ఎంపీటీసీలు తొందర్లో అవిశ్వాస తీర్మానం

### ఎంపీటీసీలు లేకుండా సర్వసభ్య సమావేశం ఎలా జరుపుతారు

### ఆవేదన వ్యక్తం చేసిన ఎంపీటీసీలు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఫిబ్రవరి 10)
ఎంపిపి విలువల్లేని రాజకీయాలు మానుకోవాలని ఎంపిటిసిలు అన్నారు. మండలంలోని పలు పంచాయతీల వైసీపీ ఎంపీటీసీలు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దారవీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి సర్వసభ్య సమావేశానికి ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలలో ఎంపీటీసీలు ఉన్నారా లేరా అని ఎంపీపీకి ఎంపీడీవోకు అర్థం కాకుండా ఉన్నదని వారు అంటున్నారు. సమావేశం నిర్వహించినప్పుడు కనీసం గ్రామంలో ఉన్న ఎంపీటీసీకి సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారని. మండిపడ్డారు. కనీసం ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్కు కూడా సమాచారం ఇవ్వకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారన్నారు. తొందర్లోనే అవిశ్వాస తీర్మానం పెట్టి ఐదు మంది ఎంపీటీసీలు రాజీనామా చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే ఎంపీపీకి చెప్పినా కూడా సొంత నిర్ణయాలతో వెళ్లి పార్టీలో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎంపీటీసీలు మండిపడ్డారు. త్వరలోనే కలెక్టర్, జడ్పీ సీఈఓ, డిపిఓను కలిసి వినతి పత్రాలు అందజేస్తామన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగే అన్ని అవినీతి పనులకు సంబంధించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారన్నారు. ఎంపిటిసిల పట్ల అధికారులు నిర్లక్ష్య ధోరణి వివరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గుండారెడ్డి వెంకటేశ్వర్రెడ్డి, గంగయ్య, ఎంపీటీసీలు సుబ్బమ్మ, గొట్టం వేణుగోపాల్రెడ్డి, ఉప్పలపాటి రేణుకా, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కల్గించవద్దు

### ఎమ్మెల్యే ఉగ్ర



(షణ్ముఖ వెలుగు, సిఎస్పురం, ఫిబ్రవరి 10)
మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని భైరవకోన, మిట్టపాలెం లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం, భైరవకోన, మిట్టపాలెం క్షేత్రాల్లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల నుంచి భైరవకోనకు పెద్ద ఎత్తున భక్తులు రానున్నారని తెలిపారు. తాగునీటి వసతితో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. భైరవకోన, మిట్టపాలంలో అధికారులు, పాలకవర్గంతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు, పాలక వర్గాలకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిఎల్డిఓ శ్రీనివాసరెడ్డి, డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్, సిఐ మాకినేని శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 10)
బద్వేల్ పురపాలక సంఘ పరిధిలో శాశ్వత తాగునీటి సరఫరా లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకం కింద మంజూరైన రూ.102 కోట్ల నిధులలో భాగంగా, భావనారాయణ నగర్ ప్రాంతంలో ప్రతిపాదిత వాటర్ ట్యాంకుల నిర్మాణానికి సంబంధించి శనివారం స్థల పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నరసింహారెడ్డి, ఇన్చార్జ్ టిపిబివో నరసయ్య, కుమ్మరి కొట్టాల అడ్మిన్ సెక్రటరీ చెన్నారెడ్డి పాల్గొని ప్రతిపాదిత నిర్మాణాల పై అధికారులతో చర్చించారు. భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ స్థల పరిశీలన నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.అమృత్ 2.0 పథకం ద్వారా బద్వేల్ పట్టణానికి శాశ్వత నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

## ఇసుక, మట్టి అక్రమ రవాణా పై కఠిన చర్యలు

### ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 10)
పల్నాడుజిల్లా వినుకొండ నియోజకవర్గ పరిధిలో ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తే సహించేది లేదని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్తో ఫోన్లో మాట్లాడిన జీవీ ఆంజనేయులు ఇసుక, మట్టి అ క్రమ రవాణాపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వనరులు కాపాడటంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా వ్యవహరిస్తే కఠిన చర్యలుతీసుకోవాలని జీవీ ఆంజనేయులు అధికారులకు సూచించారు. కాగా జీవీ ఆంజనేయులు విజ్ఞప్తి మేరకు జిల్లా కలెరు మైనింగ్, రెవిన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అక్రమ రవాణాకు పాల్పడే వారు ఎంతటి వారైనా కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com